


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 08-09-2020 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 312 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## తల్లులకు పోషణ...

# పిల్లలకు రక్షణ

### అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ కేంద్రాలుగా మార్చబోతున్నాం

### చదువు, ఆలోచనల్లో బలహీనులుగా ఉండకూడదనే ఈ పథకాలు

### సంపూర్ణ పోషణ పథకాలను ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





అమరావతి: నేటి బాలలే రేపటి పౌరులని.. చిన్నారులకు పౌష్టికాహారం అందించడం కోసమే సంపూర్ణ పోషణ పథకాలను ప్రారంభించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తానేటి వనిత, బొత్స సత్యనారాయణ, శంకర్ నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ హెల్దీ బాడీ, హెల్దీ మైండ్ చాలా అవసరమని

తరువాయి 2లో..

### విద్యావిధానంలో

# ప్రభుత్వాల జోక్యం తగ్గాలి

### ప్రధాని నరేంద్రమోదీ



న్యూఢిల్లీ: నూతన జాతీయ విద్యావిధానంలో ప్రభుత్వాల జోక్యం తగ్గాలని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. విద్యావిధానం అనేది మొత్తం భారత దేశానికి సంబంధించినదే తప్ప ఏ ఒక్క ప్రభుత్వానిది కాదని ఆయన వ్యాఖ్యానించారు. జాతీయ విద్యావిధానంపై గవర్నర్ల సదస్సు ప్రారంభం సందర్భంగా చేసిన ప్రసంగంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సదస్సుకు ప్రధాని మోదీతోపాటు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, వివిధ రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులు, వైస్ చాన్సెలర్లు హాజరయ్యారు. జాతీయ విద్యావిధానం అమలుపై ప్రధానంగా చర్చించడం కోసం ఈ సదస్సును నిర్వహించారు.

ఈ సదస్సులో ప్రధాని మాట్లాడుతూ.. దేశ ఆకాంక్షలను నెరవేర్చడానికి విద్యావిధానం, విద్యావ్యవస్థ అనేవి చాలా ముఖ్యమని పేర్కొన్నారు. విద్యావ్యవస్థ ఎదుగుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు, స్థానిక సంస్థలు కూడా బాధ్యత వహించాలని ప్రధాని సూచించారు. అయితే, విద్యావిధానంలో ప్రభుత్వాల జోక్యం కచ్చితంగా తగ్గాలనేది వాస్తవమని ఆయన అభిప్రాయపడ్డారు. విదేశాంగ విధానం, రక్షణ విధానం మాదిరిగానే విద్యావిధానం కూడా దేశానికి సంబంధించినదని, ప్రభుత్వానికి సంబంధించినది కాదని ప్రధాని చెప్పారు.

నూతన విద్యావిధానం

తరువాయి 2లో..

## దేశంలో లక్షకు చేరువవుతున్న రోజువారీ కేసులు

### అత్యధిక కేసులతో రెండో స్థానంలో భారత్

న్యూఢిల్లీ: దేశంలో కరోనా కేసులు ప్రతిరోజు భారీగా నమోదవుతున్నాయి. అత్యధిక కేసులతో రెండో స్థానంలో ఉన్న బ్రెజిల్‌ను భారత్ వెనక్కి నెట్టేసింది. నిన్న 90,600 కేసులు నమోదవగా, ఈరోజు దానికి మించి రెండు వందల కేసులు అధికంగా నమోదయ్యాయి. దీంతో ఒక్క రోజు వ్యవధిలోనే కరోనా కేసులు 42 లక్షల మార్కును దాటాయి. దేశంలో మరోసారి అత్యధిక కేసులు నమోదయ్యాయి. గత 24 గంటల్లో 90,802 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య 42,04,614కు చేరింది. ఇప్పటివరకు నమోదైన మొత్తం పాజిటివ్ కేసుల్లో 8,82,542 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. మరో

తరువాయి 2లో..

## హైపర్‌సోనిక్ క్షిపణి సాంకేతిక క్లబ్‌లో భారత్




న్యూఢిల్లీ: దేశం మరో ఘనత సాధించింది. హైపర్ సోనిక్ క్షిపణిని ప్రయోగించే వాహనాన్ని సోమవారం విజయవంతంగా పరీక్షించింది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) దేశీయ సాంకేతికతో తయారు చేసిన హైపర్‌సోనిక్ టెస్ట్ డెమన్‌స్ట్రేటర్ వెహికల్ (హెచ్‌ఎస్టీడీవీ)ను సోమవారం ఉదయం 11.03 గంటలకు ఒడిశా రాష్ట్రం బాలసోర్‌లోని ఏపీజే అబ్దుల్ కలాం టెస్టింగ్ రేంజ్‌లో

తరువాయి 2లో..

## ఏపీలో విద్యాలయాలకు అనుమతి

### అన్‌లాక్-4 మార్గదర్శకాలను విడుదల చేసిన ప్రభుత్వం

అమరావతి: కేంద్రప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఏపీ అన్‌లాక్-4 మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నెల 21 నుంచి 9, 10, ఇంటర్ విద్యార్థులు విద్యాలయాలకు వెళ్లేందుకు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనికోసం తల్లిదండ్రుల రాతపూర్వక అంగీకారం తప్పనిసరి చేసింది. అంతేకాకుండా అదే రోజునుంచి పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు కూడా కళాశాలలకు వెళ్లవచ్చని తెలిపింది. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు తెరచుకునేందుకు అనుమతినిచ్చింది. 100 మందికి మించకుండా సామాజిక, విద్య, క్రీడలు, మతపరమైన, రాజకీయ సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించింది. ఈ నెల 20 నుంచి పెళ్లిళ్లకు 50 మందిని, అంత్యక్రియలకు 20 మందికి అనుమతి ఇవ్వాలని

తరువాయి 2లో..

## 'పాలను పౌష్టికాహార జాబితాలో చేర్చండి'

### కేంద్రమంత్రి స్మృతి ఇరానీకి ఉపరాష్ట్రపతి వెంకయ్య సూచన



దిల్లీ: పాలను పౌష్టికాహార జాబితాలో చేర్చాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు. ఈ మేరకు కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి స్మృతి ఇరానీతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. పౌష్టికాహారం అందించే విషయంలో తీసుకుంటున్న చర్యలపై ఉపరాష్ట్రపతి

తరువాయి 2లో..



## భవిష్యత్తు సవాళ్లను అధిగమించేందుకే నూతన విద్యా విధానం

### రాష్ట్రపతి నేతృత్వంలో జరిగిన గవర్నర్ల సదస్సులో బిశ్వ భూషణ్ హరిచందన్

అమరావతి : భారత ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన జాతీయ విద్యా విధానం 2020 ను భవిష్యత్తు అవసరాల అనుగుణంగా తీర్చిదిద్దారని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ అన్నారు. 21వ శతాబ్దపు క్లిష్టమైన ఉన్నత విద్య అవసరాలు, రానున్న సమస్యలను నూతన విధానం పరిష్కరించ గలదన్నారు. భారత రాష్ట్రపతి

తరువాయి 2లో..

### గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బలవర్ధకమైన

## పౌష్టికాహారాన్ని అందించేందుకు ఈ పథకం అమలు

### వై.ఎస్.ఆర్.సంపూర్ణ పోషణ ప్లస్, వై.ఎస్.ఆర్. సంపూర్ణ పోషణ పథకాల ప్రారంభం




విశాఖపట్నం : చిన్నారులకు పౌష్టిక ఆహారం అందించడం కోసం నిర్దేశించిన వై.ఎస్.ఆర్. సంపూర్ణ పోషణ ప్లస్, వై.ఎస్.ఆర్. సంపూర్ణ పోషణ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి సోమవారం నాడు తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన అంగన్ వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ఈ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. విశాఖపట్నం జిల్లా నుంచి కలెక్టరు వి.వినయ్ చంద్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతి పెద్ద ఏజెన్సీ ప్రాంతమైన పాడేరులో వై.ఎస్.ఆర్. సంపూర్ణ పోషణ ప్లస్ పథకం క్రింద గిరిజనులకు అత్యధికంగా లబ్ది చేకూరనున్నదని తెలిపారు. విశాఖ ఏజెన్సీలో 17 మండలాలలో ఈ పథకం అమలు జరగనున్నదని మరియు గిరిజన ఉప ప్రణాళికను 5 మండలాలలో 15 ప్రాజెక్టులలో గల 2741 అంగన్వాడీ కేంద్రాలలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనులకు సంబంధించి 47,000 మంది 6 నెలల నుంచి 3 సం. వయస్సు గల

తరువాయి 5లో..





# ప్రజా శ్రేయస్సు ముఖ్యమంత్రి లక్ష్యం

## రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డా.సీదిరి అప్పలరాజు





శ్రీకాకుళం : ప్రజా శ్రేయస్సు ముఖ్య మంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డా.సీదిరి అప్పల రాజు అన్నారు. మందస మండలం బహడపల్లి, రాంపురం, బేతలపురం గ్రామాలలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ కేంద్రాల నిర్మాణానికి భూమి పూజ చేసారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు దృష్ట్యా అనేక పథకాలను ముఖ్య మంత్రి అమలు చేస్తున్నారన్నారు. గ్రామ సచివాలయాలను నెలకొల్పి పాలనను ప్రజలకు చేరువ చేసారని, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అత్యంత ప్రయోజనకరంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. రైతు భరోసా కేంద్రం రైతులకు నాణ్యమై విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయడమే కాకుండా రైతు శిక్షణా కేంద్రంగా కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామాలలో హెల్త్ క్లినిక్ లను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యం పట్ల దృష్టి కేంద్రీకరించారని చెప్పారు. జిల్లా అభివృద్ధికి కంకణం కట్టుకున్న వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అని పేర్కొంటూ భావనపాడు పోర్టును రూ.3665 కోట్లతో మంజూరు చేసారని చెప్పారు. మొదటి దశలో 5 వందల ఎకరాల్లో మౌళికసదుపాయాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. భావనపాడు పోర్టు అభివృద్ధి సంస్థ నిర్మాణాన్ని చేపడుతుందని మంత్రి తెలిపారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులపై పరిశోధన చేయుటకు కిడ్నీ రిసెర్చ్ సెంటర్ ను మంజూరు చేసారని, మంచినీళ్లపేట వద్ద ఫిషింగ్ జెట్టి నిర్మాణం జరుగుతోందని ఆయన తెలిపారు. ప్రజలకు వివిధ పథకాల క్రింద ఆర్ధిక సహాయక కార్యక్రమాలను అందిస్తున్నారని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్ధికంగా ముందంజ వేయాలని కోరారు. కరోనా వైరస్ వ్యాప్తి జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మాస్కులను ధరించాలని, భౌతిక దూరం పాటించాలని, చేతులు తరచూ శుభ్రపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు

## – జిల్లా కలెక్టర్ జె.నివాస్



శ్రీకాకుళం : జిల్లాలో ఈ నెల 20 నుండి 26 వరకు జరగనున్న గ్రామ సచివాలయ పోస్టుల భర్తీ నియామక పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలులో గ్రామ సచివాలయాల పోస్టుల నియామక పరీక్షలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,198 గ్రామ సచివాలయ పోస్టుల నియామకానికి పరీక్షలు ఈ నెల 20 నుండి 26 వరకు జరగనున్నాయని చెప్పారు. పరీక్షలు రెండు పూటలు ఉంటాయని, జిల్లావ్యాప్తంగా 49,584 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందులో 25,948 మంది పురుషులు, 23,636 మంది మహిళలు, 895 మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారని వివరించారు. ఇందుకు జిల్లాలోని 17 మండలాల్లో 312 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో పక్కాగా ఏర్పాటు చేయాలని, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఉండాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతీ కేంద్రంలో తప్పనిసరిగా ప్రాథమిక వైద్య కిట్లు, అందుబాటులో ఉంచాలని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్.టి.సి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రతీ కేంద్రంలో పోలీసు బందోబస్తు ఉండాలని, ఇందుకు తగిన విధంగా సిబ్బందిని నియమించాలని కలెక్టర్ డి.ఎస్.పిని ఆదేశించారు. ఈ నెల 20 నుండి 26 వరకు జరగనున్న పరీక్షలలో భాగంగా 20 న 205 కేంద్రాల్లో 32,793 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనుండగా, 21న 65 కేంద్రాల్లో 8,770 మంది, 22న 19 కేంద్రాల్లో 4,044 మంది, 23న 10 కేంద్రాల్లో 1,495 మంది, 24న 8 కేంద్రాల్లో 1,972 మంది, 25న 2 కేంద్రాల్లో 63మంది, 26న 3 కేంద్రాల్లో 447 మంది పరీక్షలు రాయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేసారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం 39 రూట్లను ఏర్పాటుచేయడం జరిగిందని, 410 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 90 మంది అదనపు చీఫ్ సూపరింటెండెంట్లు, 410 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 25 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 264 మంది వెన్యూ కోఆర్డినేటర్ లు, 1,064 మంది హాల్ సూపరింటెండెంట్ లు, 4,035 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ సచివాలయ విభాగం సంయుక్త కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి బలివాడ దయానిధి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణ అధికారి జి.చక్రధర రావు, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జిల్లా విద్యాశాఖాధికారి కె.చంద్రకళ, డి.యస్.పి డి.ఎస్.ఆర్.వి. ఎస్.ఎన్.మూర్తి, మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ శివ నారా యణ, ఆర్.టి.సి డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.వరలక్ష్మి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'పాలను పౌష్టికాహార జాబితాలో చేర్చండి'



**మొదటి పేజీ తరువాయి**

వాకబు చేశారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో భాగంగా వారికి ఉదయం అల్పాహారం సమయంలో లేదా మధ్యాహ్న భోజనంలో పాలను చేర్చాలని వెంకయ్య సూచించారు. దీనిపై స్మృతి ఇరానీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రాలకు కూడా దీనికి సంబంధించిన సూచనలు పంపిస్తామని తెలిపారు.

**పౌల్ట్రీ రంగంలో ఔత్సాహికులకు సహకారం: అతుల్ చతుర్వేది**

అంతకుముందు కేంద్ర పశు సంవర్ధక శాఖ కార్యదర్శి అతుల్ చతుర్వేది ఉపరాష్ట్రపతిని కలిశారు. కరోనా పరిస్థితుల నేపథ్యంలో పాడి, పౌల్ట్రీ రంగం ఎదుర్కొంటున్న చర్యలను పరిష్కరించడంతో పాటు ఆ రంగాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. విధానపరమైన నిర్ణయాలతో పాటు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా పౌల్ట్రీ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేంద్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తున్నట్లు చతుర్వేది తెలిపారు. పౌల్ట్రీ రంగానికి ఇచ్చే రుణాల పునర్వ్యవస్థీకరణపై పరిశీలించాలని ఉప రాష్ట్రపతి వెంకయ్య సూచించగా.. దీనిపై ఆర్థికశాఖకు ప్రతిపాదించనున్నట్లు చతుర్వేది చెప్పారు. సంఘటిత రంగంలో సహకార సంస్థల ద్వారా పాల సేకరణ కూడా గణనీయంగా పెరిగిన విషయాన్ని ఉపరాష్ట్రపతి దృష్టికి చతుర్వేది తీసుకొచ్చారు. సహకార సంఘాలకు నిర్వహణ మూలధన రుణాలపై ఏడాదికి రెండుశాతం వడ్డీ రాయితీని ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ సమయానికి రుణచెల్లింపు జరిగితే.. అదనంగా మరో రెండుశాతం వడ్డీ రాయితీని అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సదుపాయాన్ని ప్రైవేటు పాడి పరిశ్రమలకు కూడా అందించాలని ఉపరాష్ట్రపతి సూచించగా చతుర్వేది సానుకూలంగా స్పందించారు.

# దళిత కుటుంబాల నుండి విద్యుత్ ఛార్జీలు వసూలు చేయడం చట్ట విరుద్ధం

## - సీపీఎం నగర కార్యదర్శి గంగారావు

విశాఖపట్నం : విశాఖనగరంలో జివో 91 ప్రకారం 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న దళితుల నుండి బలవంతంగా విద్యుత్ ఛార్జీలు వసూలు చేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) గ్రేటర్ విశాఖనగర కమిటీ వ్యతి రేకిస్తున్నది. తక్షణమే ఈ చట్ట వ్యతిరేక చర్యలు ఉపసంప ారించుకోవాలని ప్రభుత్వాన్ని నగర కార్యదర్శి డా.బి.గంగారావు డిమాండ్ చేశారు. వై.ఎస్.ఆర్.సి.పి అధికారంలోకి వచ్చిన తరువాత పేద దళిత కుటుంబాలకు ఉచిత విద్యుత్ 200 యూనిట్లు వరకు ఇస్తామని జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగు నెలల నుండి ఇపిడిసియల్ కి దళిత కుటుంబాలు వాడిన విద్యుత్ చార్జీలు చెల్లించటం లేదని అందువల్ల మీరే చెల్లించాలని ఇపిడిసిఎల్ అధికారులు వత్తిడి చేస్తున్నారు. చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని బెదిరిస్తున్నారు. దళితుల విద్యుత్ కనెక్షన్స్ తొలగిస్తే తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఇటీవలె రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ క్రింద ఉన్న మోటార్‌లకు మీటర్లు బిగించాలని నిర్ణయించింది. ఇప్పుడు దళితులకు ఎదురైన పరిస్థితే రేపు రైతులకు ఎదురయ్యే ప్రమాదం పొంచి ఉన్నది.

ఎస్క్రో ఎకౌంట్ తెరిచిన రైతులకు నష్టం జరిగే అవకాశం ఉంది. ఎందుకంటే ఇప్పుడు దళిత కుటుంబాలకు 200 యూనిట్లు విద్యుత్ ఛార్జీల బిల్లులు కూడా 2225-01-800-11-08-330-000" ఎస్క్రో ఎకౌంట్ ద్వారా సోషల్‌వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిస్కామ్‌లకు చెల్లిస్తున్నది. కాని 4నెలల నుండి ఈ ఎకౌంట్‌కి రాష్ట్ర సభ్యత్వం నిధులు ఇవ్వటం లేదు. ఫలితంగా దళితుల బిల్లులు చెల్లించక పోతే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యుత్ బకాయిల చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం.

**మొదటి పేజీ తరువాయి**

## భవిష్యత్తు సవాళ్లను అధిగమించేందుకే నూతన విద్యా విధానం

రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఉన్నత విద్యావిధానంలో మార్పులు ఆశిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానం 2020పై సోమవారం నిర్వహించిన గవర్నర్ల సదస్సులో రాష్ట్ర గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ విజయవాడ రాజ్ భవన్ నుండి ఆన్ లైన్ విధానంలో పాల్గొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీతో సహా పలువురు ప్రముఖులు ఈ సదస్సులో నూతన విద్యా విధానం గురించి తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జాతీయ విద్యా విధానం -2020 ను తాను స్వాగతిస్తున్నానన్న గవర్నర్, ఉన్నత విద్యావ్యవస్థలో నాణ్యతా ప్రమాణాలను సాధించాలనే లక్ష్యంతో నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన విద్యావిధానాన్ని నిజమైన స్ఫూర్తితో అమలు చేయాలని యోచిస్తోందని బిశ్వ భూషణ్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పరిశోధనలలో నాణ్యత, నవ్యతతో పాటు పేటెంట్ ఆధారిత పరిశోధన, మేధో సంపత్తి హక్కులను ప్రోత్సహించే క్రమంలో జాతీయ పరిశోధన అభివృద్ధి సంస్థతో రాష్ట్ర విశ్వవిద్యాలయాల పక్షాన అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. రాష్ట్రంలో సంస్థాగత పరిశోధనలను ప్రోత్సహించడానికి రాష్ట్ర స్థాయి పరిశోధనా మండలిని ఏర్పాటు చేయటమే కాక, విద్యా సంస్థలను పరిశ్రమలతో అనుసంధానించటం ద్వారా మెరుగైన ఫలితాలు రాబట్టే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. జాతీయ విద్యా విధానం -2020 యొక్క సిఫారసులకు అనుగుణంగా ఆన్‌లైన్, డిజిటల్ విద్యకు ప్రాముఖ్యతను ఇస్తూ, మిశ్రమ అభ్యాసాన్ని ప్రోత్సహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక నూతన నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని గౌరవ గవర్నర్ అన్నారు. గ్రామీణ, వెనుకబడిన విద్యార్థులకు ఆన్‌లైన్ విద్యకు అవకాశం కల్పించడానికి, పట్టణ, గ్రామీణ, మారుమూల ప్రాంతాల మధ్య సాంకేతికత లభ్యతలో అంతరాన్ని తగ్గించడానికి ఇ-లెర్నింగ్ కమ్యూనిటీలను ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందించారని వివరించారు.

నూతన పాలసీ సిఫారసులను అధ్యయనం చేయడానికి, రాష్ట్రంలోని నిర్దిష్ట అవసరాలను దృష్టిలో ఉంచుకుని పాలసీ అమలు కోసం విధాన చర్యలు, మార్గదర్శకాలను సూచించడానికి ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఉన్నత విద్యావ్యవస్థలో నాణ్యత, ప్రమాణాలను ప్రోత్సహిస్తూ, జాతీయ విద్యా విధానం 2020 ను అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని గవర్నర్ స్పష్టం చేసారు. ఈ సదస్సులో విజయవాడ రాజ్ భవన్ నుండి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, గవర్నర్ వారి కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఉన్నత విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర, కళాశాల విద్యా కమీషనర్ ఎంఎం నాయక్, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ అచార్యా హేమచంద్రా రెడ్డి, గవర్నర్ వారి సంయిక్త కార్యదర్శి శ్యామ్ ప్రసాధ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో విద్యాలయాలకు అనుమతి

నిర్ణయించింది. 21 నుంచి ఓపెన్ ఎయిర్ థియేటర్లకు అనుమతి ఇచ్చినప్పటికీ సినిమా హాళ్లు, స్విమ్మింగ్‌పూల్స్, ఎంటర్‌టైన్‌మెంట్ పార్కులకు అనుమతి నిరాకరించింది.

## విద్యావిధానంలో ప్రభుత్వాల జోక్యం తగ్గాలి

అమలుపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ప్రధాని కోరారు. రాష్ట్రాలు ఈ నెల రోజుల్లో వేటికవే ఆయా రాష్ట్రాల పరిధిలో విద్యావ్యవస్థకు సంబంధించిన భాగస్వాములతో సమావేశమై నూతన విద్యావిధానం అమలుపై చర్చలు జరుపాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. మనం ఏదైనా మార్పు చేస్తున్నప్పుడు ప్రజల మనుషుల్లో అనుమానాలు, ప్రశ్నలు రేకెత్తడం సహజమేనని ప్రధాని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్‌లో సహజంగానే సందేహాలు తలెత్తుతాయన్నారు.

నూతన విద్యావిధానం అమలుపై సమగ్ర చర్చ జరుపడం చాలా ముఖ్యమని, ప్రజల్లో తలెత్తే అన్ని రకాల సందేహాలను నివృత్తి చేసి, అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన తర్వాతనే కొత్త ఎడ్యుకేషన్ పాలసీ అందుబాటులోకి వస్తుందని ప్రధాని పేర్కొన్నారు. నూతన విద్యావిధానం-2020 21వ శతాబ్దానికి ఒక లక్ష్యాన్ని సమకూరుస్తుందని, దాంతో తన ఆకాంక్షలకు అనుగుణంగా దేశం స్వావలంబన సాధిస్తుందని ప్రధాని చెప్పారు. దేశాన్ని ఒక విజ్ఞాన గనిగా మార్చడానికి నూతన ఎడ్యుకేషన్ పాలసీ తోడ్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

## దేశంలో లక్షకు చేరువవుతున్న రోజువారీ కేసులు

32,50,429 మంది బాధితులు కరోనా నుంచి కోలుకోగా, కరోనా వైరస్ వల్ల 71,642 మంది మరణించారు. తాజాగా నిన్న ఉదయం నుంచి ఈ రోజు ఉదయం వరకు మరో 1,016 మంది బాధితులు మృతిచెందారని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించింది. సెప్టెంబర్ 6 వరకు దేశవ్యాప్తంగా 4,95,51,507 నమూనాలను పరీక్షించామని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎమ్మార్) ప్రకటించింది. నిన్న ఒక్కరోజే 7,20,362 మందికి కరోనా పరీక్షలు నిర్వహించామని తెలిపింది.

## హైపర్‌సోనిక్ క్షిపణి సాంకేతిక క్లబ్‌లో భారత్

పరీక్షించారు. అగ్ని క్షిపణిని దీని ద్వారా ప్రయోగించగా విజయవంతమైంది. డీఆర్డీవో చీఫ్ సతీశ్ రెడ్డి, హైపర్‌సోనిక్ క్షిపణి బృందం ఆధ్వర్యంలో ఈ ప్రయోగం జరిగింది. అన్ని ప్రమాణాలను ఈ పరీక్ష ద్వారా సాధించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో హైపర్‌సోనిక్ సాంకేతిక పరిజ్ఞానం కలిగిన అమెరికా, రష్యా, చైనా తర్వాత నాలుగో దేశంగా భారత్ నిలిచినట్లయ్యింది.

శబ్ద వేగం కన్నా ఆరు రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణించే హైపర్‌సోనిక్ క్షిపణుల తయారీకి ఈ ప్రయోగం వీలు కల్పిస్తుంది. రానున్న ఐదేండ్లలో మార్క్ 6 జెట్ ఇంజన్ కన్నా వేగంగా దూసుకెళ్లగల హైపర్‌సోనిక్ క్షిపణులను డీఆర్డీవో తయారు చేయగలదని సంబంధిత వర్గాలు తెలిపాయి. హైపర్‌సోనిక్ క్షిపణులు సెకండుకు రెండు కిలోమీటర్ల దూరం చొప్పున ప్రయాణించి లక్ష్యాలను అత్యంత వేగంగా ఛేధిస్తాయని రక్షణ వర్గాలు పేర్కొన్నాయి. కాగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్‌సింగ్ ఈ పరీక్ష విజయవంతం పట్ల డీఆర్డీవోకు అభినందనలు తెలిపారు. దేశీయంగా అభివృద్ధి చేసిన హైపర్‌సోనిక్ సాంకేతికత 'ఆత్మనిర్భర్ భారత్'ను సాకారం చేసుకోవడంలో మైలురాయి వంటిదని ప్రశంసించారు.

## తల్లులకు పోషణ.. పిల్లలకు రక్షణ

తెలిపారు. "గర్భిణీల్లో 53 శాతం మందికి రక్తహీనత ఉంది.

తక్కువ బరువున్న పిల్లలు సుమారు 32 శాతం మంది ఉన్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న గర్భిణీలు, బాలింతలు, 6 నుంచి 72 నెలలలోపు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తాం. చదువు, ఆలోచనల్లో బలహీనులుగా ఉండకూడదనే ఈ పథకాలు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ కేంద్రాలుగా మార్చబోతున్నాం. 55,607 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తాం. ప్రపంచంతో పోటీ పడే విధంగా ఇంగ్లీష్ మీడియాన్ని కూడా తీసుకొచ్చాం. తల్లులకు పోషణ, పిల్లలకు రక్షణగా వైఎస్ఆర్ పోషణ, వైఎస్ఆర్ పోషణ ప్లస్ పథకాలు ఉంటాయని' సీఎం తెలిపారు.

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం కింద 26.36లక్షల మంది గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల కోసం రూ.1,555.56 కోట్లు ఖర్చు చేయబోతున్నామని తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం కింద 77 గిరిజన మండలాల్లో 3.80లక్షల మంది గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల కోసం రూ.307.55 కోట్లు కేటాయించామన్నారు. మొత్తంగా సుమారు రూ.1863 కోట్లు ఖర్చు చేయబోతున్నామని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు.

**సీఎం ప్రసంగంలో ముఖ్యాంశాలు..**

ఇవాళ ప్రారంభిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలు నిజంగా మంచి చేయడంలో సంతృప్తి ఇచ్చే కార్యక్రమాలు. గతంలో పిల్లలు ఎలా ఉన్నారు ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారా లేదా ఆరోగ్యంగా ఉన్నారా వారి తల్లులు ఎలా ఉన్నారన్నది ఎవరూ ఆలోచన చేయలేదు. వారికి ఏం చేయాలన్నది కూడా ఆలోచించలేదు. హెల్తీ బాడీ. హెల్తీ మైండ్. అన్నది ఎవ్వరూ పట్టించుకోలేదు. చాలీ చాలని విధంగా నిధులు ఇచ్చేవారు. ఏటా రూ.500 కోట్లు ఇస్తే ఎక్కువ అన్నట్లుగా ఉండేది. మన పిల్లలు రేపటి పౌరులు, రేపటి ప్రపంచంతో వారు పోటీ పడే స్థితిలో ఉన్నారా లేరా అన్నది చూశాక వారిలో మార్పు తీసుకురావాలని అన్ని కోణాల్లో ఆలోచించి నిర్ణయం తీసుకున్నాం.

నేటి తరంలో చాలా మందికి మంచి ఆహారం లభించడం లేదు. పిల్లలు, తల్లిదండ్రులు ఆ పరిస్థితిలో ఉన్నారు. వారందరిలో మార్పు తీసుకురావడం కోసమే ఈ పథకాలు.

పేదల పిల్లలకు బలహీనత, రక్తహీనత వంటి అనేక అనారోగ్య సమస్యలు ఉన్నాయి.

వాటికి సంబంధించి మన పిల్లలు ఎలా ఉన్నారన్నది చూస్తే, అలాగే తల్లుల పరిస్థితి చూస్తే.. గర్భవత్సులో దాదాపు 53 శాతం మంది రక్తహీనతతో బాధ పడుతున్నారు.

31.9 శాతం పిల్లలు తక్కువ బరువుతో జన్మించడం లేదా 5 ఏళ్ల వరకు అలాగే ఉంటున్నారు.

17.2 శాతం మంది పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు లేరు. మరో 31 శాతం మంది పిల్లలు బరువుకు తగ్గ ఎత్తులో లేరు . ఇంత దుస్థితి ఉంది, ఇవి కొత్తగా వచ్చినవి కావు, కానీ గతంలో పాలకులు ఏ మాత్రం పట్టించుకోలేదు. ఈ నెంబర్లు మారాలి, పరిస్థితి మారాలి. పిల్లల ఎదుగుదల లేక, వారు వెనకబడి పోతున్నారు. ఇంట్లో తినడానికి తగిన ఆహారం లేకపోతే, అది పిల్లల మేధస్సు, ఎదుగుదలలో కనిపిస్తోంది. తల్లిదండ్రులకు తగ్గట్లుగా పిల్లలు కూడా తగిన ఎదుగుదల లేక ఉన్నారు. ఈ పరిస్థితి మారాలి. ఇవన్నీ తెలిసినా, గతంలో ఎవరూ పట్టించుకోలేదు. అందుకే ఈ ప్రభుత్వం ముందుకు అడుగు వేసింది. ఆ దిశలోనే పిల్లలు, గర్భిణీలు, బాలింతల బాగు కోసం ఈ పథకాలు. 55607 అంగన్‌వాడీల పరిధిలో పూర్తి మార్పులు చేస్తూ, పీఎ పీపీ-2 ప్రారంభిస్తున్నాం.

బాగా డబ్బున్న వారి కుటుంబాల వారి పిల్లలు ప్రాథమిక స్థాయిలో రకరకాల చదువులు చదువుతున్నారు, పేద పిల్లలు కూడా అలాగే చదవాలన్న తపనతో ఈ మార్పులు చేస్తున్నాం. పీపీ-1, పీపీ-2 ప్రారంభిస్తూ, ఇంగ్లీష్ మీడియంలో గట్టి పునాది వేసేలా అంగన్‌వాడీల్లో మార్పు చేస్తున్నాం.

## గుజ్జు రాము ఆధ్వర్యంలో
# బీజేపీ జీవీఎంసీ భీమిలి జోన్ 2వవార్డు కార్యవర్గం



భీమునిపట్నం : జీవీఎంసీ భీమిలి జోన్ 2వ వార్డులో గల ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో బీజేపీ 2వ వార్డు అధ్యక్షునిగా నియమించబడ్డ గుజ్జు రాము ఆధ్వర్యంలో బీజేపీ భీమిలి నియోజక వర్గ ఇంఛార్జి కె ఎన్ పీ చక్రవర్తి ముఖ్య అతిధిగా హాజరై బీజేపీ జీవీఎంసీ 2వ వార్డు కార్యవర్గం నిర్వహించారు. ఈ కార్యవర్గం లో ప్రధాన కార్య దర్శిగా శీరపు రామలక్ష్మి, కోశాధికారిగా పేర్ల తిరుమలరావు, ఉపాధ్యక్షులుగా చిల్లా త్రినాధ్ రెడ్డి, రావాడ జయలక్ష్మి, అత్తిలి శ్రీనివాసరావు లను, కార్యదర్శులుగా చేట్ల రాజసులోచన, తోనంగి వెంకయ్య రెడ్డి, గండిబోయిన సాధూరావు లను, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గా లోల హరిప్రసాద్ ను, మహిళా మోర్చా అధ్యక్షురాలుగా గుజ్జు గుణాదేవి, ఎస్సీ మోర్చా అధ్యక్షునిగా పూడికల రాజు ను, కిసాన్ మోర్చా అధ్యక్షునిగా తోనంగి రాము ను, వార్డు కార్యవర్గ సభ్యులుగా కొల్లి శ్రీనివాస రావు, బగ్గం వేణుగోపాలరావు, ఉప్పాడ గురుమూర్తి, పిల్ల వెంకటరమణ. అవ్విన నరసింగరావు, మొక్క శ్రీనివాసరెడ్డి లను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా యుకులు మాట్లాడుతూ 2024 లో రాష్టంలో బీజేపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడ బోతోందని, వార్డు స్థాయిలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలకు వివరించాలని నూతనంగా ఏర్పడిన కార్యవర్గాన్ని కోరారు.

ఇందులో బీజేపీ సీనియర్ నాయకులు ఉప్పాడ అప్పారావు, బీజేపీ పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల కోఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు, బీజేపీ 1,2,3,4 వార్డుల కోబీఆర్డినేటర్ కోరాడ శంకర రావు, బీజేపీ 5,6,7,8 వార్డుల కో ఆర్డినేటర్ పేరి శ్రావణ్‌కుమార్ లు పాల్గొన్నారు.

# తప్పుడు ఆరోపణలు తగదు
## కొయ్యూరు వెలుగు ఏపిఎం రాజుబాబు

కొయ్యూరు : తనపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని కొయ్యూరు వెలుగు ఏపిఎం టి.రాజుబాబు పేర్కొన్నారు. సోమ వారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తాను విధుల్లోకి చేరి రెండున్నర నెలలు కావస్తుందన్నారు. నేను గ్రామ సంఘాల యొక్క ఆర్థిక లావాదేవీలు పరిశీలించడం జరుగుతుందన్నారు. అదే క్రమంలో సిసి నాగేశ్వరరావు పని చేస్తున్న గ్రామ సంఘాల యొక్క లావాదేవీలు కూడా పరిశీలించడం జరిగిందన్నారు. ఆయన పని చేసిన కొమ్మిక విఒనకు రూ.3లక్షల రుణం మంజూరు చేయడం జరిగిందని, 2.30లక్షలు గ్రౌండింగ్ చేసియున్నారన్నారు. మిగిలిన రూ.70వేలు లెక్కలు చూపించడం లేదన్నారు. అలాగే అతని విఒల్లో పౌండ్స్ అన్నియు పరిశీలన చేయగా సుమారు రూ.5లక్షల నుండి రూ.9లక్షల మధ్యన నిధులు దుర్వినియోగం అయినట్లు నిర్ధారించి ఏపిడిఎల్‌పిఒ ఐటిడిఎకు రిపోర్టు పెట్టడం జరిగిందన్నారు. నాటి నుండి సిసి ఫోన్‌లు చేసి బెదిరింపులు చేయిస్తున్నారన్నారు. పై అధికారి అన్న భయం లేకుండా దురుసుగా ప్రదర్శిస్తున్నారన్నారు. దీనికి సిసి సత్తిబాబు, అప్పలనర్స కూడా ప్రత్యక్ష సాక్షులున్నారన్నారు. సమస్య ఉంటే పై అధికారులకు ఫిర్యాదు చేయకుండా ఇతరులతో వార్నింగ్ ఇప్పిస్తున్నారన్నారు. లేనిపోని మాటలు చెప్పి కులం పేరుతో తిట్టారని అంగవైకల్యం వాడని అన్నట్లు ప్రచారాలు చేస్తున్నారన్నారు. మా యొక్క సిసిలను తమరు దీనిపై విచారణ చేసుకోవచ్చునన్నారు. లేనిపోని అక్రమాలకు పాల్పడుతున్న సిసి నాగేశ్వరరావు పై శాఖాపరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# వైయస్ఆర్‌సీపీ సీనియర్ నాయకులు
## రూక ఓబుల్ రెడ్డి హఠాన్మరణం...

**నివాళులర్పించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు ఎస్.బి. అంజాద్బాష...**



కడప : కడప పట్టణం రూకవారిపల్లి కి చెందిన వైయస్ఆర్సిపి సీనియర్ నాయకులు రూక ఓబుల్ రెడ్డి (68) సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు గుండెపోటుతో మరణించారు. దీంతో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు ఎస్.బి.అంజాద్బాష, సోమవారం రూకవారిపల్లెకు వెళ్లి రూక ఓబుల్ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి సానుభూతి తెలిపారు. ఈ కార్య క్రమంలో 50 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అశోక్ రెడ్డి, 31 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అజ్మతుల్లా, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, తదితరులు పాల్గొన్నారు.

# నేడు విజెఎఫ్ ప్రతిభకు ప్రోత్సాహం
## మీడియా అవార్డులు, స్కాలర్ షిప్స్ పంపిణీ




విశాఖపట్నం : వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రతిభకు ప్రోత్సాహం కార్యక్రమాన్ని కోవిడ్ మహమ్మారిని దృష్టిలో పెట్టుకుని నవంబర్ ఎనిమిదోవ తేదిన నిర్వహించ తలపెట్టామని వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు గంట్ల శ్రీనుబాబు, సోడిశెట్టి దుర్గారావులు తెలిపారు. సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది జర్నలిస్టుల పిల్లలను విద్యారంగంలో ప్రోత్సహిస్తూ జూన్ తొలివారంలో స్కాలర్‌షిప్‌లు కార్యక్రమం నిర్వహించేవారమన్నారు. కోవిడ్ నేపధ్యంలో దీనిని నవంబర్ ఎనిమిదోవ తేదికి వాయిదా వేశామన్నారు. పాఠశాలల్లో మార్కుల జాబితాను ( అర్ధ సంవత్సరం పరీక్షా ఫలితాలు తీసుకొని రెండు పాస్ ఫోర్టు ఫోటోలను జతచేసి ఈ మాసాంతం లోపు డాబాగార్డెన్స్ ప్రెస్‌క్లబ్‌లో అందచేయాల్సి వుంటుందన్నారు. ఇతర వివరాల కోసం స్కాలర్ షిప్స్ కమిటీ చైర్మన్, ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబును సంప్రదించవచ్చునన్నారు. అవార్డుల కమిటీ చైర్మన్ ఆర్ నాగరాజ్ పట్నాయక్ మాట్లడుతూ సబ్ ఎడిటర్ , వీడియో, ఫోటో జర్నలిస్టులు క్రీడా, క్రైమ్ ,చిన్న పత్రికలకు సంబంధించిన సంఘాలు వారే ఇద్దరు ప్రతినిధులను ఎంపిక చేసి తమ లెటర్ హెడ్ పై ప్రతిపాదిత పేర్లు, బయోడేటాలతో విజెఎఫ్ కార్యలయంలో అందచేయాలన్నారు. ఆకర్షణీయ సాంస్కృతిక ప్రదర్శనలు, లక్కీడిప్ వంటి ప్రత్యే కతలతో కోవిడ్ పరిస్థితులను దృష్టిలో వుంచుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

ఈ విలేకర్ల సమావేశంలో ప్రతిభకు ప్రోత్సాహం కో చైర్మన్‌లు టి.నానాజీ, పిఎన్ మూర్తి, దాడి రవికుమార్, కార్యవర్గ ప్రతినిధులు ఇరోతి ఈశ్వరావు, ఎంఎస్ఆర్ ప్రసాద్, వరలక్ష్మి, పి దివాకర్, దొండా గిరిబాబు, కె.ఆర్.శేఖర్ మంత్రి, గయాజ్, డేవిడ్ రాజ్, మాధవ్ పాల్గొన్నారు.

## వివేకానంద సంస్థ.. నిత్య అన్నదాన కార్యక్రమానికి...
# 11,116 ఆర్థిక సహాయం అందించిన ప్రముఖ సంఘ సేవకులు

**ఆశ్రమంలోని.. వృద్ధులకు అల్పాహారం, నిరుపేద కుటుంబాలకు కూరగాయలు పంపిణీ..**
**ఆధ్యాత్మికవేత్త, వైసీపీ యువజన విభాగం మాజీ అధ్యక్షుడు విల్లూరి భాస్కరరావు**



విశాఖపట్నం : విల్లూరి భాస్కరరావు, పరమేశ్వరావు తండ్రియైన స్వర్గీయ విల్లూరి మాణిక్యాల రావు 17 వ వర్ధంతి సందర్భంగా ఆయన పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖ, వన్టౌన్ ప్రాంతంలో ఉన్న వివేకానంద అనాధ వృద్ధాశ్రమంలోని.. నిత్య అన్నదాన పథకానికి..రూ. 11,116 లు విరాళంగా అందజేశారు. జీవీఎంసీ యుసిడి పిడి శ్రీనివాస్, 39 వ వార్డు, వైసిపి కార్పొరేటర్ అభ్యర్థి కొల్లి సింహాచలం చేతుల మీదుగా..సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావుకు అందజేశారు.. ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న.. వృద్ధులకు.. అల్పాహారాలు, సబ్బులు పంపిణీ చేశారు. కరోనా మహమ్మారి కారణంగా సరైన పనులు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు కూరగాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేసిన. మా తండ్రిగారికి జన్మజన్మలకం..రుణవడి ఉంటామని, ఆయన చూపించిన సేవా మార్గంలో నిరంతరం నడుస్తామని తెలియ జేశారు. జీవనోపాధి లేక పోవడం వల్ల నిరుపేద కుటుంబాలు దయనీయస్థితిలో జీవనం సాగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వారిని ఆదు కోవడం కోసం.. నిర్విరా మంగా సేవా కార్యక్రమాల నిర్వహి స్తున్నామని తెలిపారు. పేద ప్రజలు ఆకలితో ఉండకూడదని మంచి ఆశయంతో.. లాక్ డౌన్ ప్రారంభం నుంచి నేటి వరకు పెద్ద ఎత్తున బియ్యం, నిత్యా వసర వస్తు వులు, కూరగాయలు, మాస్కులు, శానిటైజర్లు, పండ్లు, సబ్బులు పంపిణీ చేయడం జరిగిందని వెల్లడించారు.

## వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకం కార్యక్రమం



గొలుగొండ : వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీరాంపురం, గొలుగొండ 1, 2 సెంటర్ నుంచి అంగన్వాడీ కార్యకర్తలు కార్య క్రమాన్ని టీవీలో వీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పేదలైన గర్భిణి స్త్రీలు, బాలింతరాలు, చిన్నారుల్లో పౌష్టికాహారం అందించనుంది.

# రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ విధానాలు వ్యతిరేకిస్తున్నాం



విశాఖసిటీ : విశాఖ నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముఖ్య నాయకులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ విధానాలపై వ్యతిరేకిస్తూ లేఖను విడుదల చేయడం జరిగింది. ఈ లేఖను విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కి విశాఖ కలెక్టర్ ఆఫీస్ లో అందజేయడం జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఈ కార్య క్రమంలో పాల్గొన్న జి.ఎ.నారాయణరావు తో పాటు గత అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థులు గంప గోవిందరాజు, వద్ది పర్తి శ్రీనివాసరావు, జాతీయ సేవాదళ్ ప్రతినిధి బొమ్మిడి గంగాధర్, రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి సోడాదాసి సుధాకర్ ..నగర సీనియర్ నాయకులు పి.శంకరరావు, కస్తూరి వెంకట్రావు వైయస్ జగన్ మోహన్ రావు భీమిలి నియోజకవర్గం నుంచి గంధంమహేష్, ఉమ్మడి భాస్కరరావు మరియు పార్టీ కార్యాలయ కార్యదర్శి తాతారావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# కోవిడ్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు రోజు ప్రతి వార్డులో జరపాలి
## - జివియంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన



విశాఖపట్నం : మహా విశాఖ నగరంలో కోవిడ్-19 వైరస్ వ్యాధులు విస్తృతంగా వ్యాప్తి చెందుతున్నందున, వాటిని అదుపులోకి తెచ్చుటకు గానూ, నివారించుటకు తప్పనిసరిగా రోజూ ప్రతి వార్డులో 75 నుండి 100 వరకు ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరపాలని జివియంసి. కమిషనర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఈ విషయమై జివియంసి పాత సమావేశ మందిరంలో అన్ని జోనల్ కమిషనర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి వార్డులో రోజూ కోవిడ్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరపాలని, రోజుకు 5000 పరీక్షలు జరుపుటకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన పరిచి, వారికి సహకారం అందించే ఏర్పాట్లు జరపాలని అందుకు వార్డు స్పెషలాఫీసర్ లు బాధ్యతలు చేపట్టాలన్నారు. ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుపుటకు వార్డు వైద్యాధికారులు ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలలో బాధ్యతగా విధులు నిర్వహించాలని కమిషనర్ అన్నారు. ముఖ్యంగా వయో వృద్ధులు, డయాబెటిక్ తదితర వ్యాధిగ్రస్తులు, గర్భిణీ స్త్రీలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుపుటకు ప్రాధాన్యత నిస్తూ, వారిపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. ఈ వ్యాధి నిర్ధారణ పరీక్షల ఫలితాలను %మీా ఖజూజూ%లో పొందుపరచాలన్నారు. కోవిడ్ వ్యాధి నిర్ధారణ అయిన వారిని, ఆ వ్యాధి తీవ్రతను బట్టి హోమ్ ఐసోలేషన్ కు లేదా కమ్యూనిటీ కేర్ సెంటర్ ఆస్పత్రులకు తరలించాలన్నారు. హోమ్ ఐసోలేషన్ కేసులను తప్పకుండా వైద్య అధికారులు, ఏ.ఎన్.ఎం.లు, ఆశా వర్కర్ల పర్యవేక్షణ జరిగేటట్లు ఏర్పాట్లు చేయాలని జోనల్ కమిషనర్ లను, ప్రధాన వైద్యాధికారిని కమిషనర్ ఆదేశించారు. కంటైన్మెంట్ జోన్లలో యాక్టివ్, వెరీ యాక్టివ్ కేసులను, కోవిడ్ వ్యాధి లక్షణాలు కలిగి ఉన్నవారిని గుర్తించుటకు నిత్యం పర్యవేక్షణ జరపాలని అధికారులను కమీషనర్ ఆదేశించారు.వ్యాధి నిర్ధారణ అయిన వారి యొక్క ప్రైమరీ కాంటాక్ట్ లను, సెకండరీ కాంటాక్ట్ జాబితాలను వెంటనే గుర్తించి వారికి త్వరగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరపాలని అధికారులకు కమిషనర్ ఆదేశించారు. అలా చేయడం వలన ఎక్కువ వ్యాధిగ్రస్తులను వెంటనే గుర్తించగలమని, తద్వారా వ్యాధి వ్యాప్తిని అదుపులోకి తీసుకురావడానికి అవకాశం ఉందని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అధనపు కమీషనర్లు ఎ. వి. రమణి, ఆర్. సోమన్నారాయణ, డా. వి. సన్యాసిరావు, చీఫ్ సిటీ ప్లానర్ విద్యుల్లత, ప్రాధాన వైద్యాధికారి డా. కె.ఎస్.ఎల్.జి. శాస్త్రి, యు.సి.డి. పి. డి. వై. శ్రీనివాసరావు, అందరు జోనల్ కమీషనర్లు, డి.సి.ఆర్. ఎం. వి. డి. ఫణిరామ్, ఎస్.ఇ. లు శివ ప్రసాద రాజు , కె.వి.ఎన్. రవి, ఇ.ఇ. లు తదితరులు పాల్గొన్నారు.

## చిట్టివలస జ్యూట్ మిల్ కార్మికులు
# 378 మందికి పిఎఫ్

భీమునిపట్నం: చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులు 378 మందికి పియప్ ఇస్తున్నట్లు పియప్ ట్రస్టు మెంబర్ సాడి సూరిబాబు (సిఐటియు) తెలిపారని, చిట్టివలస జ్యూట్ మిల్లు మెకానికల్ వర్కర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సెక్రటరీ తెలిపారు.

కార్మికులు గేటు వద్ద కు వెళ్లి తమ పేర్లు చూసుకుని బాలెన్స్ షీటు ఇస్తార ని ఆ షీటు పియప్ మొత్తం సరిపోయిందో లేదో సరి చూసుకుని, సరిపోతే సంతకం పెట్టి గేటు లో ఇస్తే ఈ నెల 15 వ తారీఖు తరువాత మీ సొమ్ము మీ అకౌంట్ లో వేస్తారని ఆయన చెప్పారని రవ్వా నర్సింగరావు తెలిపారు. మొత్తం రూ. 2,00,63,400 అవుతుందని మిగిలిన పి.యప్ క్లైమ్స్ కూడా త్వరగా పరిశీలన పూర్తి చేసి కార్మికులకు ఇవ్వాలని, చిట్టి వలస జ్యూట్ మిల్లు పి.యప్ ట్రస్టును కోరారు. టస్టీ మెంబర్లకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో యస్. అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.


**రక్షణ మంత్రిత్వ శాఖ**
**నావల్ డాక్‌యార్డు, విశాఖపట్నం**
**(టెలిఫోన్: 0891 2816350, 6366 ఫ్యాక్స్: 0891 2816688)**
**ఇ-టెండరు ప్రకటన**

కోటింగ్ నెం. **ఆర్‌పివైపి/ఆర్‌సి/19-20/302**

1. **ఎన్‌డి(వి) వద్ద ఎమ్‌వైయస్ విభాగపు 1000 కిలోవాట్ & 500 కిలోవాట్ మొబైల్ డీజిల్ జనరేటరు రెంటినీ (ఒక సంవత్సరం పాటు) అద్దెకు తీసుకునేందుకు కాంట్రాక్టు రేటు కొరకు** ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా సీలు చేసిన డిజిటల్ టెండర్లు కోరుచున్నారు.
2. ఇ-టెండరు డాక్యుమెంట్లు **"www.defproc.gov.in"** వెబ్‌సైటు నుంచి డౌన్‌లోడ్ చేసుకోగలరు. ఆఫ్‌లైను టెండరు డాక్యుమెంటుతో ధరావతు జమ నిమిత్తము ఏదేని జాతీయ బ్యాంకు నుంచి తీసిన **రూ.2,95,700/-**ల డిమాండు డ్రాఫ్టును జతచేయవలెను.
3. **ప్రి-బిడ్డు సమావేశము : 11 సెప్టెంబరు 2020/1030 గం.లకు ఎమ్‌వైయస్ విభాగము** వద్ద బిడ్డర్లు తమ ప్రతినిధులకు పంపగలరు. ప్రి-బిడ్డు సమావేశమునకు వ్రాత పూర్వకంగా అధికారికంగా ధృవీకరించబడిన ప్రతినిధులు సదరు తేది మరియు సమయమున సమావేశమునకు హాజరుకాగలరు.
4. పేర్కొనబడిన ఐటమ్ యొక్క టెండరింగుకు సంబంధించి ఏవేని సందేహాలున్నచో **MYP-ENCNDV@NAVY.GOV.IN** కు మెయిల్ చేయగలరు. మరియు సాంకేతిక విషయాలపై సందేహాలున్నచో **ఎమ్‌వైయస్ విభాగము**ను టెలిఫోన్ నెం. 0891-2816363 పై సంప్రదించగలరు.
5. సీలు చేసిన ఆఫ్‌లైను టెండర్లు **"MYP"** అని మార్క్ చేసిన నేవల్ డాక్‌యార్డు, విశాఖపట్నపు విజయనగర్ గేటు వద్ద ఉన్న టెండరు బాక్సులో వేయగలరు. లేదా సదరు కార్యాలయానికి **19 సెప్టెంబరు 2020 (1830 గం.లు)**లోగా చేరేలా రిజిష్టరు పోస్టు ద్వారా పంపగలరు.

**davp 10702/11/0038/2021** **డిజిఎమ్ (ఆర్‌పి)**

# విజయభాను సంపాదకీయం

## సైకిల్‌తో అనుబంధం

సైకిల్ ఏ రకంగా చూసినా మేలైనదే. చౌకగా లభిస్తాయి. శరీరదారుఢ్యాన్ని పెంచుతాయి. బాలికలకు, మహిళలకు సాధికారత లభిస్తుంది. ప్రయాణం లో స్వతంత్రత ఉంటుంది. నిర్వహణ ఖర్చు ఉండదు. క్రీడాకారులు ఆసియా గేమ్స్, ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి ఉపయోగపడుతుంది.

గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన వారికి సైకిల్‌తో అనుబంధం ఉంటుంది. నేను పెరిగిన ఒడిశాలోని రూర్కెలా అలాంటి అనుభూతిని ఇచ్చేదే. దాదాపు నలభయేండ్ల కిందటి ఆ జ్ఞాపకాలు ఇంకా పచ్చిగానే ఉన్నాయి. వానలో కాళ్లు దిగబడే బురద ప్రాంతాల్లో సైక్లింగ్ నాకిప్పటికీ గుర్తొస్తుంటుంది. సైకిల్‌పై నా తొలి దీర్ఘ ప్రయాణం ఒక పిక్నిక్ కోసం మిత్ర బృందంతో కలిసి 35 కిలోమీటర్లు వెళ్లడం. మా కాలేజీకి కూడా 15 కిలోమీటర్లు సైకిల్‌పై వెళ్ళేవాళ్ళం.

హైదరాబాద్‌లో సెటిలైన తరువాత పరిసరాల్లోని శామీర్‌పేట, ఫాక్స్ సాగర్, తుర్కపల్లి చెరువు, ఘట్‌కేసర్, నర్సాపూర్, లాల్‌గడి మలక్‌పేట తదితర ప్రాంతాల్లో సైకిల్‌పై పర్యటించడం మరిచిపోలేని గొప్ప అనుభూతి. నేను నా ఇంగ్లిష్ కవితల తొలి పుస్తకాన్ని (మూవింగ్ ఆన్..) తెచ్చినప్పుడు మూడునెలలపాటు ఆ ప్రదేశాలన్నింటినీ కలియదిరిగాను. అక్కడి పచ్చదనం మనిషిలోని భావుకుడిని తట్టిలేపేది.

ఈ కొవిడ్ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్‌లో నాకు మళ్ళీ సైక్లింగ్ కోరిక చెలరేగింది. లాల్‌గడి మలక్‌పేట పరిసరాల్లో తిరిగాను. ప్రణాళిక లేని, వేగవంతమైన నగరీకరణ తెచ్చిన దుష్ఫలితాలు నన్ను దిగ్భ్రాంతికి గురిచేశాయి. గ్రామాలు కూడా నగరాల వలెనే గందరగోళంగా మారిపోతున్నాయనిపించింది. సైకిళ్ల వల్ల గ్రామాలకు మళ్ళా పల్లెదనం తేవచ్చా అనే ఆలోచన కూడా కలుగుతున్నది. ఇది బంగారు తెలంగాణ సాధనకు దోహదపడుతుందా అనే ఆలోచన కూడా కలుగుతున్నది.

సైకిల్ ఏ రకంగా చూసినా మేలైనదే. చౌకగా లభిస్తాయి. శరీరదారుఢ్యాన్ని పెంచుతాయి. బాలికలకు, మహిళలకు సాధికారత లభిస్తుంది. ప్రయాణంలో స్వతంత్రత ఉంటుంది. నిర్వహణ ఖర్చు ఉండదు. క్రీడాకారులు ఆసియా గేమ్స్, ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి ఉపయోగపడుతుంది.

ఆఫీసుకు వెళ్ళడానికైనా, సంతోషం కోసమైనా పల్లెల్లో ఉన్నవారు సైకిళ్ళపై వెళ్ళే అవకాశం ఎందుకు ఉండకూడదు! ప్రతి ఊరిలో జనాభాకు అనుగుణంగా గ్రామ పంచాయితీకి కొన్ని సైకిళ్ళు కేటాయించాలి. వీటిని అందరూ వాడుకోవాలె. పొలం దగ్గరికి, బడికి పోయేవారు ఈ సైకిళ్ళను వాడుకోవచ్చు. సైకిళ్ళను మాత్రమే అనుమతించే ఆదర్శ గ్రామాలను తయారు చేసుకోవచ్చు. దీనివల్ల ఎన్నో లాభాలున్నాయి. రోడ్డు ప్రమాదాలుండవు. కాలుష్యం తగ్గుతుంది. శ్వాసకోశ సంబంధిత వ్యాధులు అసలే ఉండవు.

ఇదే వ్యూహాన్ని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ వంటి చిన్న, మధ్యస్థాయి పట్టణాలలో అమలు చేయవచ్చు. సైకిల్‌పై వెళ్ళడాన్ని ఒక ప్రశాంతమైన ప్రయాణంగా, ఫ్యాషన్‌గా మార్చాలి. తెలంగాణలోని పలు చిన్న మధ్యతరహా పట్టణాలలో మంచి రహదారులున్నాయి. కానీ ఇవి మెల్లగా ట్రాఫిక్ జామ్ వంటి గందరగోళంలోకి జారుకుంటున్నాయి. కాలేజీలు, పాఠశాలల చుట్టూరా ఉండే కొన్ని కాలనీలను సైక్లింగ్ జోన్స్‌గా ప్రకటించు కుంటే ఉపయోగం.

సైకిల్ ఎంత ఉపయోగకరమనేది పాశ్చాత్య దేశాలను గమనిస్తే అర్థమవుతుంది. డచ్ ప్రభుత్వం ఏటా 595 మిలియన్ యూరోలను సైక్లింగ్ కోసం ఖర్చు చేస్తున్నది. అంటే ప్రతి పౌరుడికి సగటున 35 యూరోలు వెచ్చిస్తున్నది. దీనివల్ల ఒక పౌరుడు సగటున ఏటా 912 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణిస్తున్నాడు. దీనివల్ల వైద్యం కోసం చేసే ఖర్చు 19 బిలియన్లు మిగులుతున్నవి. ఇది జీడీపీలో 3 శాతం. తెలంగాణ వంటి ప్రగతిశీల రాష్ట్రం కూడా సైకిల్ సంస్కృతిని పెంపొందిస్తే బాగుంటుంది.

నెదర్లాండ్స్‌లో సగానికి పైగా జనాభా సైకిళ్ళపై ప్రయాణిస్తారు. బెల్జియం, జర్మనీ, నార్వే, ఇంగ్లాండ్, స్వీడన్ తదితర దేశాలలో కూడా సైకిల్ ప్రాముఖ్యం కనిపిస్తుంది. భారత్ ఎప్పుడూ పోల్చుకునే చైనాలో కూడా సైకిల్ పోకడ ఉన్నది. ప్రపంచంలోకెల్లా ఎక్కువ సైకిళ్ళు ఉన్నది షాంఘైలోనే. కార్లకన్నా సైకిళ్ళ సంఖ్యే ఎక్కువ ఉంటుందంటే ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. తెలంగాణ నుంచి ఒక అధికార బృందం ఈ దేశాలకు వెళ్ళి సైకిల్ ప్రయాణం కోసం ఏయే సౌకర్యాలు కల్పించాలి, దాని వల్ల ఎటువంటి సత్ఫలితాలు ఉన్నాయనేది అధ్యయనం చేయాలి.

ప్రపంచవ్యాప్త పోకడ నేపథ్యంలో సైకిల్ వ్యాపారం వృద్ధి చెందుతున్నది. ఈ రంగంలో తెలంగాణ ముందడుగు వేయవచ్చు. పలు సైకిల్ కంపెనీలు పదిహేను నుంచి ఇరవై శాతం మేర ధరలు పెంచాయి. సైక్లిస్టుల వస్తువులకు ఎంతో డిమాండ్ ఉన్నది.

# ఘనంగా సంఘ 15 వ వార్షికోత్సవ వేడుకలు

## అగాపే సంఘానికి డాక్టర్ బొగ్గు శ్రీను తన పూర్తి సహాయ సహకారాలు అందజేస్తున్నారు



కంచరపాలెం : అగాపే సంపూర్ణ సువార్త సంఘం(బర్మా క్యాంప్) 15వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సామాజిక కార్యక్రమాల్లో భాగంగా నిరుపేదలకు పండ్ల పంపిణీ కార్యక్రమం అద్భుతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంఘ సేవకుడు డాక్టర్ బొగ్గు శీను ముఖ్య అతిథిగా హాజరై ఈ వార్షికోత్సవాలను ప్రారంభించారు. అనంతరం వారి చేతుల మీదుగా అనేక నిరుపేదలకు పండ్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బొగ్గు శ్రీను అగాపే సంపూర్ణ సువార్త సంఘం సభ్యులు ఒక మతపరమైన కార్యక్రమాలే కాకుండా అన్ని మతాలను గౌరవిస్తూ బర్మా కాలనీ తదితర ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ వారికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు మాట్లాడుతూ జై భారత్ నగర్ గ్రామ అధ్యక్షుడిగా సంఘ సేవకుడిగా పేరుగాంచిన డాక్టర్ బొగ్గు శ్రీను గత కొన్ని సంవత్సరాలుగా మా సంఘానికి చేదోడువాదోడుగా ఉంటూ మా సంక్షేమ కార్యక్రమాల్లో పాలు పచుకుంటూ సహాయ సహకారాలు అందజేస్తున్న బొగ్గు శ్రీను కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




# పరారీలో ప్రధాన నిందితుడు : డీసీపీ సురేష్‌బాబు



విశాఖపట్నం: జిల్లాలో తీవ్ర సంచలనం రేపిన పీఎం పాలెం దోపిడీ కేసును విశాఖ క్రైం పోలీసులు చేధించారు. ఈ కేసులో నిందితులైన ఆరుగురిని సోమవారం అరెస్ట్ చేసి వారి నుంచి 12.50 లక్షల రూపాయలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా విశాఖ క్రైం డీసీపీ సురేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ... ఈ కేసులో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సుదర్శన్ రెడ్డి పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టమని చెప్పారు. అరెస్టు అయిన వారంతా విశాఖకు చెందిన వారేనని, నిందితులపై గతంలో కలకత్త, పంజాగుట్ట, ఆనకాపల్లీ, శ్రీకాకుళం, గోపాలపట్నంలలో ఇలాంటి కేసులే నమోదయ్యాయని ఆయన వెల్లడించారు. పోలీసుల వివరాలు ప్రకారం... విశాఖ రైల్వే న్యూ కాలనీకి చెందిన కోటేశ్వర రావు కిరాణా వ్యాపారం చేస్తుంటాడు. అదే ప్రాంతంలో నివసించే అతడి బావ ఏటూరి చిట్టిరాజు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో చిట్టిరాజుకు చంద్రశేఖర్ రెడ్డి అనే వ్యక్తి పరిచయమయ్యాడు.

ఈ క్రమంలో తాను బంగారం అవసరమైతే తక్కువ రేటుకి ఇప్పిస్తానని, అయితే అరకేజి కంటే తక్కువ బంగారం ఇవ్వడం సాధ్యం కాదని చిట్టిరాజు, కోటేశ్వరరావును నమ్మించాడు. ఈ నేపథ్యంలో చిట్టిరాజు, కోటేశ్వర రావులను 20 లక్షల రూపాయలను తీసుకు రమ్మని వారిని చెప్పి దోపిడీ చేయాలని ప్రయత్నించి రెండు సార్లు విఫలమయ్యారు. చివరగా గత నెల ఆగస్ట్ 17న మరోసారి పిఎం పాలెం క్రికెట్ స్టేడియం దగ్గరికి 20 లక్షల రుపాయలు తీసుకుని రమ్మని చెప్పాడు. ఆ డబ్బును బయటకు తీసి లెక్కబెడుతుండగా ఇన్నోవా వాహనంలో పోలీస్ సైరన్‌తో వచ్చి వారిని భయపెట్టి 20 లక్షలతో ఉడాయించాడు.

ఇక జరిగిన సంఘటనపై బాధితుడు కోటేశ్వర రావు స్థానిక పోలీసుల స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కోటేశ్వరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎంపీపీ పోలీసులు డీసీపీ సురేష్ బాబు ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు.

## కవి సమయం

### స్నేహితుడు

నా స్నేహితుడు వరం
మూడ్ ఎప్పుడూ గరం గరం
గర్ల్‌ఫ్రెండ్‌తో ఆడుతుంటాడు సరసం
చదువంటే విరసం
నచ్చిన వంటకం పాయసం
ఎప్పుడూ చెప్పించుకుంటాడు జోస్యం
బలాదూర్ గా తిరగడం ఇష్టం
తెస్తాడు ఇంటికెంతో కష్టం
చేసిన ప్రతీ వ్యాపారంలో నష్టం
ఏ పనికి వుండకూడదు ఇష్టం

...కవితా రచన
సి.ప్రతాప్

# కోటబొమ్మాళి మండలం చిన్న బమ్మిడి, గ్రామం టిడిపి నుంచి వైకాపా లోకి చేరికలు



టెక్కలి : వాన జనార్ధన రావు,రెడ్డి కృష్ణారావు,రెడ్డి ప్రకాష్,రెడ్డి. ప్రభాకర్, వాన రాంబాబు, వాన సింహాచలం, చింతు సింహాచలం,వాన సింహాచలం,పట్ట గోవిందరావు,వాన చిట్టిబాబు,వాన రాజశేఖర్, ముద్దాడ వసంత్ పలువురు టీడీపీ నుంచి వైసీపీ పార్టీ లో టెక్కలి నియోజకవర్గ ఇంఛార్జ్ దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేరారు.. అనంతరం

కోటబొమ్మాళి మండలం రేగులపాడు గ్రామంలో సచివాలయం,రైతు భరోసా,వెల్నెస్ సెంటర్లకు భూమీ పూజ తదుపరి సూర్యనారాయణ పురంలో కార్యకర్తలతో సమావేశం. అలాగే తిలారు గ్రామంలో సచివాలయనికి భూమి పూజ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా కోటబొమ్మాళి మండలం నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

# రామలక్ష్మి నేటి గృహిణులకు ఆదర్శం నివాళులర్పించిన స్నేహబంధం



మాధవధార : రామలక్ష్మి నేటి గృహిణులకు ఆదర్శం అని మాధవధారకు చెందిన స్నేహబంధం సభ్యులు పేర్కొన్నారు. సనపల రామలక్ష్మి అకాల మరణానికి చింతిస్తూ మాధవదారలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ మాధవధార హైస్కూల్లో పదవ తరగతి చదివిన కుటుంబ సభ్యులు స్నేహబంధం ఏర్పడిందని ప్రతియేటా నిర్వహించే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని పది మందికి సేవ చేసిన రామలక్ష్మి మరణం తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, బంధువులు, మిత్రులు పాల్గొన్నారు.

# జివియంసి కమిషనర్ ఇ-స్పందన నిర్వహణ

విశాఖపట్నం : పట్టణ పరిధిలో కరోనా వైరస్ వ్యాప్తి చెందుతుండడం వలన ప్రజల వద్ద నుండి విన్నపములు నేరుగా స్వీకరించేందుకు అవకాశము ఉండుటలేదు. కావున, దీన్ని దృష్టిలో పెట్టుకొని అంతర్జాల సహాయముతో ఫేస్ బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల వద్ద నుండి విన్నపములు సోమవారం జి.వి.ఎం.సి. సమావేశ మందిరం నుండి ఇ-స్పందన కార్యక్రమంలో జి.వి.ఎం.సి.. కమిషనర్ డా. జి. సృజన స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి ఫిర్యాదులపై వివరణ ఇస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు. ఈ ఇ-స్పందన కార్యక్రమంలో పట్టణ పరిధిలో పలు ప్రాంతాల నుండి మొత్తము 57 ఫిర్యాదులు రాగా, అందులో 09 ఎలక్ట్రికల్ విభాగానికి సంబందించినవి, 12 పబ్లిక్ వర్క్స్ విభాగానికి సంబందించినవి, 01 యు.జి.డి విభాగానికి సంబందించినవి, 06 నీటి సరఫరా విభాగానికి సంబందించినవి, 04 రెవెన్యూ విభాగానికి సంబందించినవి, 13 పబ్లిక్ హెల్త్ (శానిటేషన్, అర్బన్ మలేరియా మరియు వెటరినరీ) విభాగానికి సంబందించినవి, 10 పట్టణ ప్రణాళికా విభాగానికి సంబందించినవి, 02 యు.సి.డి. విభాగానికి సంబందించినవి స్వీకరించుట జరిగినదని కమిషనరు తెలిపారు. ఈ ఇ-స్పందన కార్యక్రమంలో పలుచోట్ల క్రొత్తగా రోడ్ల నిర్మాణం కొరకు, వీధి దీపాలు కొరకు, పందులు నివారణ కొరకు, ఆక్రమణలు మరియు అనధికార నిర్మాణాలపై ఫిర్యాదులు స్వీకరించడమైనదని కమీషనర్ తెలిపారు. అనంతరం, కమిషనర్ ఇ-స్పందన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రజావినతులు ఇ-స్పందన కార్యక్రమం ద్వారానే కాకుండా, మీ సమీపంలోనున్న వార్డు సచివాలయాల్లో, ప్రధాన కార్యాలయంలో, విజ్ఞప్తులు, వినతులు, అర్జీల ద్వారా సమస్యలు పరిష్కరించుకోగలరని, ఈ అవకాశాన్ని ప్రజలు గమనించి వినియోగించుకోవాలని కమిషర్ విజ్ఞప్తి చేశారు. ఈ ఇ-స్పందన కార్యక్రమంలో



సమస్యలపై 57 మంది స్పందించి, వివరణలు తెలిపి, విన్నపములు సమర్పించారు. వీటిపై తగు చర్యలు తీసుకొనే నిమిత్తం సంబంధిత ప్రధాన విభాగపు అధికారులు / జోనల్ స్థాయి అధికారులకు పంపడానికి కమిషనర్ చర్యలు తీసుకున్నారు. అనంతరం, ఇ-స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై వీడియో కన్ఫెరెన్స్ ద్వారా జోనల్ కమిషనర్లతో సమావేశమయ్యారు. ఇ-స్పందనలో పరిష్కారం కాని వినతులు, ఫిర్యాదులపై కమిషనరు జోనల్ అధికారులను అడిగితెలుసుకున్నారు. ముఖ్యంగా నీటి సరఫరా విభాగానికి, ప్రజారోగ్య విభాగానికి, ఇంజినీరింగు విభాగానికి సంబందించిన ఫిర్యాదులు వచ్చిన 2 రోజులలోనే పరిష్కరించాలన్నారు. అన్ని వినతులు త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు తెలియజేసేందుకు ఇ-గవర్నన్స్ నందు పూర్తి వివరాలు పొందుపరచాలని కమిషనర్ జోనల్ కమిషనర్లను, సంబంధిత అధికారులను ఆదేశించారు.

# సీఎం వైఎస్ జగన్ సంకల్పానికి దేవుడు ఆశీస్సులు ఉండాలి



కంచరపాలెం : 47 వ వార్డ్ లో కప్పరాడ అంగన్వాడీ లో వైయస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ప్రారంభించిన కోరిబిల్లి విజయ్ కార్యక్రమంలో కార్పొరేటర్ అభ్యర్థి కంటిపాము కామేశ్వరి మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో రాష్ట్ర ఖజానాలో ఎన్ని ఇబ్బందిలు ఉన్న సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్న ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డీ సంకల్ప నికి దేవుడు ఆశీస్సులు ఉండాలిని కోరుకుంటూ, అంగన్వాడీలను సమ స్యలు తెలుసుకోని నాడు నేడు ద్వారా ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజు దృష్టికి తీసుకోని వెళతా మని ఈ సందర్భంగా మహిళలకు ఫేస్ షీల్డ్, మాస్క్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది రమణమ్మ గారు, అంగన్వాడీ టీచర్ సూరిడమ్మ, దేవి, వార్డు సీనియర్ నాయకులు రఘువులు, కర్రీ శంకర్, బూత్ ఇంచార్జి సుకుమార్, వసంతాల అప్పారావు, కృపా, కన్వీనర్లు వాసు, సుధ, మొక్క రమణ, గురువోజి సాయి,యాల్లజీ, సురేష్, తారకేష్, అనిల్, చందు, రాజు, నాగ రాజు అధిక సంఖ్యలో మహి ళలు తదితరులు పాల్గొన్నారు.

# 'వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ' ప్రారంభోత్సవాన్ని వీక్షిస్తున్న సచివాలయం సిబ్బంది



విశాఖపట్నం : అర్బన్-2 ప్రాజెక్టు మద్దిలపాలెం సెక్టార్‌లో గల కెఆర్ఎం కాలనీ-1 అంగన్‌వాడీ కేంద్రంలోని బెన్ ఫిషరీస్‌ని ఏడబ్లూ డబ్ల్యూ ఆర్.సుబ్బలక్ష్మి సచివాలయం-7కు తీసుకెళ్ళి అక్కడ 'వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ' ప్రారంభోత్సవాన్ని వీక్షించేలా చేశారు.

ఈ కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ జాన్, డబ్ల్యూపిఎస్. సిహెచ్. అలేఖ్య, వాలంటీర్లు భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి, లావణ్య మరియు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా రైతులందరికీ అందాలి



వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బూడి

- రైతులు ఆందోళన చెందనవసరం లేదు
- కొంతమంది ఉనికి కోసం రాద్ధాంతం చేస్తున్నారు
- ప్రభుత్వ విప్ బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : యూరియా కోసం రైతులు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద మండల వ్యవసాయ అధికారిణి వి.వి. సృజనతో మాట్లాడుతూ మండలంలోని రైతులందరికీ యురియా అందాలని ఆదేశించారు. రైవాడ జలాశయం ఆయకట్టు సుమారు 15 వేల 344 ఎకరాలు పైబడి ఉండడంతో రైతులు వరి సాగు చేస్తారని, వర్షాలతో పాటు,ప్రస్తుతం సాగునీరు అందడంతో ఎరువుకు డిమాండ్ పెరిగిందన్నారు. దీన్ని ఆసరా చేసుకొని కొంతమంది పనిగట్టుకొని నానా రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. రైతులందరికీ ఎరువుల సకాలంలో అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పిఎసిఎస్ ద్వారా ఎరువుల విక్రయాలను మరింత పెంచి సకాలంలో రైతుకు యూరియా అందేలా చర్యలు చేపట్టాలన్నారు ఎక్కడ ఎటు వంటి సమస్య లేకుండా రైతుకు ఎరువులు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, వైయస్సార్ సిపి నాయకులు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కర్ రావు, డాక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, మండల వ్యవసాయ విస్తీరణ అధికారి ఎస్. కిరణ్ కుమార్, ఈఓపిఆర్ డి ఎం.రాధిక తదితరులు పాల్గొన్నారు.

# దిష్టి బొమ్మ దగ్ధంపై న్యాయస్థానంలో తేల్చుకుంటాం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కొయ్యూరు : బిజెపి మండలాధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు దిష్టిబమ్మ దగ్ధం విషయంలో కొంత మంది వైసిపి నాయకులు దుష్ట ఆలోచన విషయంలో బిజెపి మండల కార్యదర్శులందరి ఏకాభిప్రాయం మేరకు న్యాయం స్థానంలోనే తేల్చుకుంటామని బిజెపి నేతలు తేల్చి చెప్పారు. సోమవారం బిజెపి జెడ్పీటీసీ అభ్యర్థి కూడా నూకరాజు, రీమల చంద్రరావులు మాట్లాడుతూ ఈ విషయంపై ఎస్పై దృష్టికి తీసుకువెళ్లగా 5వ తేదీన ఇరువర్గాల వారిని పిలిపించి బైండోవర్ చేస్తామని చెప్పారన్నారు. క్షమాపణ పత్రం విషయ దాటవేత దోరణిలో వదిలేయడం, చెడు ప్రోత్సాహం, ప్రశాంత మన్య సంస్కృతికి భవిష్యత్‌కు భంగం కలిగించే అవినీతి, లోపాయికొంచి ఆలోచనా పరువు వ్యూహాత్మకంగా అమాయక గిరిజన మహిళా సోదరీమణులను ముందుకు నడిపించి వారిని దోషులు చేసి అసలు కథా నాయకులు తప్పించుకు తిరుగుతున్నారని, ఈ నాటకీయ పరిణామాల దృష్ట్యా కోర్టును ఆశ్రయిస్తామన్నారు. ఈ విధంగా అసాంఘిక కార్యకలాపాలకు, తప్పడు సంస్కృతులకు ప్రోత్సహించిన నాయకుల పట్ల మీ సొంత పార్టీలో, ప్రజలలో చులకన భావం ఏర్పడిందని, విర్రవీగితే తగిన ఆధారాలతో బుద్ధి చెబుతామన్నారు. వైసిపిలో తగిన స్థానం లేనివారు, దిష్టి బొమ్మను తగులపెట్టించిన వారు క్షమాపణులు అడగటం సిగ్గు చేటని అవినీతిపరుల చిట్టా మా దగ్గర ఉందని న్యాయస్థానం ముందు దోషులుగా నిలిబెట్టి తగిన బుద్ధి చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో మచ్చల మంగతల్లి, కొర్రు నూఐకరాజు, కొనకం భీమయ్యమ్మ పాల్గొన్నారు.

# విశాఖలో గుండెపోటుతో 50 శాతం పైగా హార్ట్ ఫెయిల్యూర్ బాధితులు

**గుండెపోటుతో బాధపడుతున్నామని 50 శాతానికి పైగా రోగులు తమను సంప్రదించారని పేర్కొన్న నిపుణులు**

**యువతలో కరోనరీ ఆర్టరీ డిసీజ్ కూడా కీలక అంశమని వెల్లడించిన వైద్యులు**

విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో గుండెపోటు సమస్య పెరుగుతున్న రోగుల సంఖ్య పెరుగుతున్నది. దాదాపు 50 శాతం మంది రోగులు వైద్య పరీక్షల్లో గుండెపోటుతో ఏదో ఒక గుండె సంబంధ వ్యాధికి గురవుతున్నారని వైద్య పరీక్షల్లో తేలింది. గుండెపోటు వల్ల మరణాల సంఖ్య పదేపదే రోగులు ఆసుపత్రులకు వెళ్లల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలుస్తోంది. నాలుగో వంతు గుండెపోటు రోగులు ఏడాదిలోపు వైద్య పరీక్షల్లో గుండెపోటు సమస్యను నిర్ధారించుకున్న వారే. యువతలో ముప్పు అంశాలివే. హృద్ధమని వ్యాధితో గుండెపోటు సమస్యలు పెరిగాయి. ధమనిలో బ్లాక్‌జే సమస్య హృద్ధమని వ్యాధి (సీఏడీ) కారణమని ఇటీవలి అధ్యయనంలో తేలింది. ధమనుల నాళాలపై కొలెస్ట్రాల్, కొవ్వు పెరిగిపోవటమే దీనికి కారణం. విశాఖపట్నంలో సెవెన్ హిల్స్ హాస్పిటల్ డాక్టర్ శశాంక చంద్రీ మాట్లాడుతూ నిశ్చల జీవన శైలి, అధిక ఒత్తిడి, అధిక పంచదార వాడకం, ఉప్పు తినడం, అనారోగ్యకరమైన భోజనం, వాయు కాలుష్యం తదితర అంశాలు గుండెపోటుకు కారణాలు అవుతున్నాయని తెలిపారు. గుండెపోటు సమస్యలు ఎదుర్కొంటున్న ప్రతి ముగ్గురిలో ఒకరు వైద్య పరీక్షల్లో నిర్ధారించిన ఏడాదిలోపే మరణిస్తున్నారని పేర్కొన్నారు. యూరప్, అమెరికా దేశాలతో పోలిస్తే పదేళ్ల ముందే భారతదేశంలో 59 సంవత్సరాల వయస్సునోనే ప్రజలు గుండెపోటుకు గురవుతున్నారన్నారు. కొలెస్ట్రాల్, కొవ్వు తదితర అంశాల వల్ల గుండె కండరాలు బిరుసుగా మారతాయి. ఫలితంగా రక్త సరఫరా సరిగ్గా జరగదు. దీనివల్ల శరీరంలోని ముఖ్యమైన అవయవాలకు ఆక్సిజన్, పోషకాహారాలు అందడంలేదు. విశాఖపట్నంలోని కింగ్‌జార్జి హాస్పిటల్ డాక్టర్ జీ రవికుమార్ మాట్లాడుతూ అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వారేఎక్కువగా వైద్య పరీక్షలను చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. గుండెపోటు సమస్యలు ఎదుర్కొంటున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారని తెలిపారు.

ఫలితంగా గుంగడెపోటు మరణాలను తగ్గిస్తోందన్నారు. సమయానుకూలంగా వైద్య పరీక్షల నిర్ధారణ, జీవన శైలిలో మార్పలు, అధునాతన చికిత్సా పద్ధతులు, సమర్థవంతంగా గుండెపోటు చికిత్స పొందడం వల్ల తరుచూ హాస్పిటలైజేషన్ మరణాల సంఖ్యను తగ్గించి వేస్తోందని తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.కోటి విరాళం



అమరావతి : కోవిడ్ -19 నివారణలో భాగంగా సహాయ చర్యల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఠాగూర్ ల్యాబరెటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ (తంపాకంలగవాడెం, పశ్చిమగోదావరి జిల్లా) తరపున కోటి రూపాయల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా విరాళానికి సంబంధించిన చెక్కులను ఠాగూర్ ల్యాబరెటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ పి.వి.సుబ్రహ్మణ్యం రాజు, ఎండీ పి.కాశీ విశ్వనాథ్ రాజు ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం సీఎం వైఎస్.జగన్‌ను కలిసి అందజేశారు. కార్యక్రమంలో తణుకు ఎమ్మెల్యే కారుమూరి నాగేశ్వరరావు, కారుమూరి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**- షుగర్ కమిషనర్ కు ఫ్యాక్టరీ గుర్తింపు యూనియన్ నాయకులు రాయి సూరిబాబు, శరగడం రాము నాయుడు వినతి**



కార్మికుల సమస్యలపై షుగర్ కేన్ కమిషనర్ కు వినతి పత్రం అందిస్తున్న ఫ్యాక్టరీ వర్కర్స్ గుర్తింపు యూనియన్ నాయకులు శరగడం రాము నాయుడు, రాయి సూరిబాబు

చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ లో పనిచేస్తున్న కార్మికుల దీర్ఘకాలిక సమస్య లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ షుగర్ కేన్ కమిషనర్ వి వెంకట్రావుకు గోవాడ షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ (గుర్తింపు) యూనియన్ అధ్యక్ష కార్య దర్శులు రాయి సూరిబాబు, శరగడం రామునాయుడు వినతి పత్రాలు అందజేశారు. ఫ్యాక్టరీని సందర్శించిన షుగర్ కేన్ కమిషనర్ ఫ్యాక్టరీ గెస్ట్ హౌస్ లో ఆయన్ను కలిసి తమ సమస్యలపై వివరించారు. ముఖ్యంగా పది సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న పర్మినెంట్ కార్మికుల వేతన సవరణ చేయాలని, 30 సంవత్స రాల నుంచి ఎన్ యం ఆర్, వోచర్ పేమెంట్ కార్మికులుగా ఉన్న వారిని పర్మినెంట్ చేయాలని, ఓల్డ్ కాంట్రాక్ట్ లేబర్, సెక్యూరిటీ సిబ్బందిని కంపెనీ కార్మికులుగా గుర్తించాలని కమిషన్ను కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులతోపాటు, కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా వైయస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమం



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి నూతనంగా ప్రవేశ పెట్టిన వైయస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమం రైతు భరోసా కేంద్రం -1నందు అంగనవాడీ సిబ్బంది,గ్రామ కార్యదర్శి, వైయస్ఆర్ సీపీ నాయకులు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు దడాల.సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకంలో నిరుపేద కుటుంబంలో ఉన్న గర్భిణీలు, బాలింతలు రక్త హీనత కు గురికాకుండా మంచి ఆరోగ్యంతో ఉంటూ అందమైన బిడ్డలకు జన్మను ఇస్తూ ప్రతీ కుటుంబం సంతోషముగా ఉంటుందని, ముఖ్యమంత్రి పాలక ముందు చూపు తో సాగుతుందని,నిరుపేద,బడుగు,బలహీన వర్గాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి పదం లో ఉంటుందని,ప్రతీ పథకం పేద వారికి చేరవేస్తూ అభివృద్ధి పదంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డికి,ప్రత్తిపాడు నియోజక వర్గం శాసన సభ్యులు పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్ కు సభా పూర్వకముగా అభినందనలు తెలియజేశారు.

అలాగే అంగన వాడీలు ద్వారా ఇస్తున్న పోషక పదార్థాలు నెలలో నాలుగు వారాలకు మల్టి గ్రేన్ ఆటా 2 కేజీలు, రాగిపిండి, బెల్లం, వేరు శెనగ అచ్చులు, నువ్వుల అచ్చులు, ఖర్జూరం 500 గ్రాములు చొప్పున ఇస్తూ పాలు 25 లీటర్లు,గ్రుడ్లు 25 చొప్పున గర్భిణీలకు ఇస్తున్నట్లు అంగనవాడీ టీచర్లు ద్వారా ఇస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ధారా వెంకటరమణ, అల్లాడ సూరిబాబు, మెరపల చంద్రరావు, సింగంపల్లి రాము మరియు అంగనవాడీ సిబ్బంది, సచివాలం సిబ్బంది,ఆరోగ్య సిబ్బంది, రైతు భరోసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేవరాపల్లిలో 11 మందికి కరోనా టెస్టులు

దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో సోమవారం 11 మందికి కరోనా టెస్టులు జరిపినట్లు వైద్యాధికారిణి ఎస్. లలితా తెలిపారు.

దేవరాపల్లి పి హెచ్ సి పరిధిలో పాజిటివ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ఆరుగురికి వి ఎల్ ఎం, ఐదుగురికి రాపిడ్ టెస్టులు చేశామన్నారు. పిహెచ్‌సి పరిధిలో ప్రస్తుతం 37 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు ఆమె తెలిపారు. వేచలం పిహెచ్‌సి పరిధిలో మార్చి నుంచి నేటి వరకు ఆరు టి బి కేసులు నమోదు కాగా వీరికి సోమవారం కరోనా టెస్టులు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్ట్ వచ్చిందని వైద్యాధికారిణి బి. హారిక తెలిపారు.

### గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బలవర్థకమైన

# పౌష్టికాహారాన్ని అందించేందుకు ఈ పథకం అమలు



మొదటి పేజీ తరువాయి

పిల్లలు, 25,000 మంది 3 సం. నుంచి 6 సం. వయస్సు గల పిల్లలు, 21,000 మంది గర్భిణులు, బాలింతలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

మిగిలిన అన్ని మైదాన మండలాలో 13 ప్రాజెక్ట్ లలో గల 2,211 అంగన్వాడీ కేంద్రాలలో వై.ఎస్.ఆర్. సంపూర్ణ పోషణ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు పథకాల ద్వారా విశాఖపట్నం జిల్లాలో గల 4,952 అంగన్వాడీ కేంద్రాల ద్వారా 1,27,944 మంది 6నెలల నుంచి 3సం. వయస్సు గల పిల్లలకు, 79,728 మంది 3 సం. నుంచి 6 సం. వయస్సు గల పిల్లలు , 59,613 మంది గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నామని దీనికి నెలకు సుమారు రూ.13 కోట్లు ఖర్చు చేయడం జరుగుతున్నదని తెలిపారు. పాడేరు మండలం గుడివాడ గ్రామం గిరిజన మహిళ మణి మాట్లాడుతూ తనకు 3 సం.ల బాబు వున్నాడని గత జనవరి నుంచి అంగన్వాడి కేంద్రం ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం వలన బాబు బరువు 10 కేజీల నుంచి 13కేజీలకు పెరిగిందని ఆరోగ్య వంతంగా వున్నాడని తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఆహారం నిమిత్తం అంగన్వాడీ కేంద్రాల పై ఆధారపడతున్నామని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం వలన వ్యాధులు రాకుండా నివారించు కోగలుగుతున్నామని తెలిపారు.

గర్భిణులు, బాలింతలకు రక్త హీనతను పోషకాహార లోపాన్ని నివారించేందుకు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. తద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వగలుగుతుందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూల్లుగా మార్చడం చాలా ఉపయోగకరంగా వుందని మా పిల్లలకు మంచి విద్యను అందించడానికి అవసరమని అన్నారు. తన కుటుంబంలో నాన్నకు వృద్ధాప్య ఫించను, అమ్మకు చేయూత, అత్తమ్మకు వితంతు ఫించను ద్వారా లబ్ధిపొందుతున్నామని తెలిపారు. తన ఇంటి చుట్టు ప్రక్కలవారికి అమ్మఒడి పథకం క్రింద లబ్ధి చేకూరిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం క్రింద నయాపైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్యాన్ని పొందగులుగుతున్నామని తెలిపారు. అనంతరం పర్యాటక శాఖా మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్ లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్లు యం . వేణుగోపాల్ రెడ్డి, గోవిందరావు, డి.యం.హెచ్.ఒ. విజయలక్ష్మి, జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు సీతా మహాలక్ష్మి, ఇతర అధికారులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ర్యాంకు తెదేపా ప్రభుత్వ ఘనతే : చినరాజప్ప






పెద్దాపురం : గతంలో తెలుగుదేశం ప్రభుత్వం చేసిన కృషి వల్లే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీకి ర్యాంకు వచ్చింది. వైపీసీ అధికారంలో వచ్చాక చేసింది సున్నా అని చెప్పారు. 2014-2019 వరకు ఏపీ అభివృద్ధికి టీడీపీనే కారణమని చినరాజప్ప చెప్పారు. పెట్టుబడుల ఆకర్షణకు, వ్యవసాయాభివృద్ధికి టీడీపీ తీసుకున్న చర్యలే కారణమన్నారు. 2019 జూన్ తర్వాత పరిస్థితులను పరిగణనలోకి తీసుకొంటే పదోస్థానంలో ఉండేదని, టీడీపీ విధానాలను కాపీ కొట్టడం తప్ప.. ఈ ప్రభుత్వం కొత్తగా ఆలోచించడం లేదని చినరాజప్ప అన్నారు. తూర్పు గోదావరి జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వేంచేసి ఉన్నారు. ఈ స్వామి వారిని దర్శించుకోవడానికి రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుండి దర్శించుకోవడానికి వస్తారు. అంతర్వేది స్వామి వారి ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. తరతరాలుగా ఈ రథోత్సవానికి గల ప్రాధాన్యతను గుర్తించి ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు 1958లో ఈ భారీ రథాన్ని తయారు చేయించారు. గత 62 సంవత్సరాలుగా అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి సేవలో ఈ రథం తరిస్తోందన్నారు. అటువంటి రథం దగ్ధం కావడం లక్షలాది మంది భక్తులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. హిందూ మనోభావాలు దెబ్బతినే రీతిలో రథం దగ్ధం కావడం విస్మయం కలిగిస్తోంది. రథాన్ని భద్రపరిచిన ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం లేదు. ఈ సంఘటన ప్రమాదవశాత్తూ జరిగిందా...?లేక ఎవరైనా దుండగులు ఉద్దేశపూర్వకంగా ఈ చర్యకు పాల్పడ్డారా..? అనేది స్పష్టం కావలసి ఉంది. శాఖాపరమైన నిర్లక్ష్యమైతే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ ఘటనను రాష్ట్ర ప్రతిపక్ష పార్టీ తెలుగుదేశం సీరియస్ గా తీసుకుంది. తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు టిడిపి నిజనిర్ధారణ కమీటి వేయడం జరిగింది. ఈ కమీటి సభ్యులుగా నన్ను (నిమ్మకాయల చిన రాజప్ప) మరియు గొల్లపల్లి సూర్యారావుని, నాగిడి నాగేశ్వరరావు మరియు బోనాం నాగేశ్వరరావుని పంపించడం జరిగింది. అదేవిధంగా హిందు మహా సభ గోపాలకృష్ణ కూడా రథం దగ్ధమైన ప్రాంతాన్ని పరిశీలించారు. 199 ప్రాంతంలో వచ్చిన భారీ తుఫాను సమయంలో కూడా స్వామి వారి కృపాకటాక్షాల వలన అంతర్వేది ప్రాంతం ఎటువంటి నష్టం వాటిల్ల లేదు. ఈ దేవాలయంలో స్వామి వారి కళ్యాణం తరువాత వివాహాలు జరగడం ఎన్నో ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం. అంతటి ప్రాధాన్యత కలిగిన అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి రథం కాలిపోవడం దురదృష్టకరం. అంతర్వేది రథోత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ ఘటనతో కోట్లాది మంది హిందువులు మనోభావాలు దెబ్బతిన్నాయి. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత పదిహేను నెలలుగా హిందు దేవాలయలపై దాడులు జరుగుతున్నాయి. గతంలో నెల్లూరు జిల్లాలో ప్రసన్నాంజనేయ స్వామి రథం దగ్ధం అయింది. పిఠాపురంలో పదుల సంఖ్యలో దేవతా విగ్రహాలు పగల కొట్టిన కేసులో మతిస్థిమితం లేని వాళ్లు చేశారని కేసు కొట్టేశారు. కొన్ని జిల్లాలో కనక దుర్గమ్మ వారి దేవాలయాలు, రామాలయలు తరచుగా ధ్వంసానికి గురవుతున్నాయి. ఇప్పటికే ఈ ఘటనపై దేవాదాయశాఖ అదనపు కమిషనర్ ను విచారణాధికారిగా నియమించారు. కోట్లాది మంది హిందూవుల మనోభావాలు సంబంధించిన అంశం కాబట్టి ఈ సంఘటపై జ్యూడిషియల్ ఎంక్వయిరీ లేదా సిబిఐ ఎంక్వయిరీ వేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నాము. రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము. అదేవిధంగా నర్సింహస్వామి రథోత్సవంలోపు నూతన రథం నిర్మాణం పూర్తయ్యేలా దేవాదాయశాఖ పూనుకోవాలి అని కోరుతున్నాము.



# గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం



పరవాడ : పరవాడ మండలము తిక్కవాని పాలెం గ్రామంలో గల సముద్ర తీరానికీ అదివారము పోటో షూటుకోసము వెళ్ళి సముద్రం లోనికి దిగిన యువకుని గల్లంతైన విషయము అందరికీ తెలిసిందే.ఈగల్లంతైన యువకుని మృతిదేహము సోమవారము లభించింది. దీనికి సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారము అనకాపల్లి మండలము కొప్పిశెట్టి నాగేశ్వరము వీదికి చెందిన ఫణేంద్ర (21) లంకెలపాలెంలో షాపు పెట్టికోని జీవినం సాగిస్తున్నారు అన్నారు. అయితే అదివారము సెలవురోజు కావడముతో టెన్త్ క్లాస్ స్నేహితు లుతో కలిసి పోటోసూటికి వెళ్ళిన వీరికి తిక్కవాని పాలెం జెట్టివద్ద పోటోలు తీసుకుంటుండుగా వీళ్ళు స్నేహితులు చూడలేని సమయంలో ఫణేంద్ర సముద్రంలో దిగారు. ఒక్కసారిగా కిరటాల ఉద్రిత ఎక్కువడముతో సముద్రంలోకి లాక్కోని వెళ్ళింది.

దీంతో స్నేహి తులు ఎంత వెతికిన కనపడలేదు. ఈ మృతదేహము సోమవారము బయటికీ వచ్చింది.

ఈ కేసును పరవాడ సిఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

# ప్రశంసలందుకున్న ఉపాధ్యాయిని పద్మావతి



ఉపాధ్యాయుని పద్మావతిని సత్కరిస్తున్న దృశ్యం

తూర్పు గోదావరి జిల్లా నవర మండల ప్రాథమిక పాఠశాలలో 1991 జనవరి 2న ఉపాధ్యాయునిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి తదుపరి పెందుర్తి మరియు అనకాపల్లి మండలం కృష్ణాపురం నందు గల ప్రాథమిక పాఠశాలలో 2020 ఆగస్టు 31న పదవీ విరమణ చేశారు.30 సంవత్సరాలు ఉపాధ్యాయునిగా నిస్వార్థమైన సేవలందించి విద్యార్థుల ఉన్నతికి పాఠశాల అభివృద్ధికి కృషి చేసి సహచర ఉద్యోగుల ప్రశంసలు కూడా పొందారు.

విశాఖపట్నం : శ్రీ హరి సంకీర్తన సేవా సంస్థ అన్నమయ్య గీతాంజలి వారి ఆధ్వర్యంలో సుబ్బలక్ష్మి నగర్ లో గల సంస్థ కార్యాలయ ప్రాంగణంలో గురుపూజా మహోత్సవం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇటీవల ఉపాధ్యాయునిగా పదవి విరమణ చేసిన వుప్పులూరి పద్మావతిని ఘనంగా సత్కరించారు. అంకితభావంతో పనిచేసిన వీరిని అన్నమయ్య గీతాంజలి ప్రధాన కార్యదర్శి ఎం వి రాజశేఖర్ కనక మహా లక్ష్మి దంపతులు ఘనంగా సత్కరించి ఉపాధ్యాయునిగా వీరు చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో శ్రీ సాయి అరుణ్ భరద్వాజ్, ఎం.జే కళ్యాణి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# చోడవరం షుగర్ ను సందర్శించిన షుగర్ కేన్ కమిషనర్ వి.వెంకట్‌రావు

**- చెరకు దిగుబడిలో రాష్ట్ర వ్యాప్తంగా పోల్చితే విశాఖ జిల్లా బాగుంది**

**- పంచదార ఉత్పత్తితో పాటు ప్రత్యామ్నాయ మార్గాలు పైన దృష్టి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న షుగర్ కేన్ కమిషనర్ వి వెంకట్‌రావు

చోడవరం : చోడవరం చక్కెర కర్మాగారాన్ని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ షుగర్ అండ్ కెన్ కమిషనర్ వి వెంకట్ రావు సోమవారం సందర్శించారు. ఇటీవల పదోన్నతి పై నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఫ్యాక్టరీని సందర్శించి ప్రస్తుత పరిస్థితిపై ఫ్యాక్టరీ ఎండి సన్యాసినాయుడు, షుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ (గుర్తింపు) యూనియన్ నాయకులు రాయి సూరిబాబు, శరగడం రాము నాయుడు తదితరులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా చెరకు ఉత్పత్తి తగ్గడం వలన ఉత్పాదక తగ్గే అవకాశం ఉందన్నారు. గత మూడేళ్లుగా చెరకు దిగుబడి సగానికి తగ్గిందని, ఇతర జిల్లాలతో పోల్చితే విశాఖ కొద్దిగా మెరుగ్గా ఉందన్నారు.

షుగర్ కేన్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని, నలుగురు మంత్రులతో కూడిన కమిటీ వేయడం జరిగిందని కమిటీ సూచనల మేరకు, భవిష్యత్ కార్యక్రమాలు చేపట్టనున్నారు. చెరకు క్రాసింగ్ లో పంచదార ఉత్పత్తితో పాటు, ప్రత్యామ్నాయ పరిశ్రమల పైనా ప్రత్యేక దృష్టి సారిస్తామని, షుగర్ ఫ్యాక్టరీ ఆధునీకరించడం తో పాటు, చెరుకు పండించే రైతులు, పనిచేసే కార్మికులను దృష్టిలో పెట్టుకొని ఫ్యాక్టరీ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కేన్ కమిషనర్ సత్య నారాయణ, ఫ్యాక్టరీ ఉన్నతాధికారులు, ఏవో వెంకట రమణ మూర్తి, కార్మికులు తది తరులు పాల్గొన్నారు.



గెస్ట్ హౌస్ వద్ద మొక్కలు నాటుతున్న షుగర్ కేన్ కమిషనర్ వి వెంకట్‌రావు


# చిరువ్యాపారులకి కనీస వసతులు కల్పించాలి

## - గంటా నూకరాజు



భీమునిపట్నం : భీమిలి టిడిపి డివిజన్ అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ కోర్ కమిటీ మెంబర్ గంటా నూకరాజు ఆధ్వర్యంలో సోమవారం భీమిలి జోనల్ కార్యాలయంలో కమీషనర్ సి.హెచ్.గోవిందరావు తరపున శానిటరీ ఇన్స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడికి స్థానికంగా ఉన్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ.కరోనా కారణంగా ప్రజలు , వ్యాపారస్తులు సామాజిక దూరం పాటించాలనే నేపథ్యంలో భీమిలి గంటస్తంభం వద్ద ఉన్న కాయకూరలు, పళ్ళ దుకాణాలు మరియు చేపలు, మాంసం దుకాణాలను బీచ్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేశారు. ఇప్పటికి ఆరు మాసాలుగా ఏర్పాటు చేసిన మార్కెట్లో వ్యాపారస్తులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు ఎండి, వానకు తడిచి, తాగడానికి మంచినీరు లేక, కనీశం మరిగుదొడ్లు లేక వ్యాపారస్తులు పడుతు న్నారని గంటా నూకరాజు అన్నారు. అధికారులు ఈ చిరువ్యాపారుల కి కనీస వసతులైన షెడ్లు వేసి, మంచినీటి అవసరం తీర్చాలని కోరుతున్నాను. అలాకాని పక్షంలో ఇంతకుముందు ఉన్న గంటస్తంభం వద్దకు అయినా మార్కెట్ ను మార్చాలని భీమిలి జోనల్ కమీషనర్ సి.హెచ్.గోవిందరావు కి ఇచ్చిన వినతిపత్రంలో తెలియజే సారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాసరపు నాగరాజు, కనకల అప్పల నాయుడు, సంకురుభుక్త జోగారావు, గండి బోయిన పోలిరాజు, దాసరి వెంకటేష్, వియ్యపు పోతురాజు, సత్తరపు చిన్న, వాసుపల్లి వంశీ, పూతి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మర్రిపాలెం వుడా లే అవుట్ లో కొత్త తరహా దొంగలు







కంచరపాలెం: నగరంలోని కొత్త తరహా దొంగలు చొరబడ్డారు. గతానికి భిన్నంగా వ్యవహరించారు. దుస్తులు తీసేసి నగ్నంగా ఇళ్లలోకి దూరారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు మొదలెట్టారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మర్రిపాలెం వుడా లేఅవుట్ లో వ్యాపారి వడ్డాది త్రినాథరావు, భార్య గౌరి, కుటుంబసభ్యులతో ఆదివారం రాత్రి తనింట్లో నిద్ర పోయారు. తెల్లవారుజామున 3గంటల సమయంలో ఓ వ్యక్తి తన ఇంటి తలుపులు, కిటికీలు పగలగొట్టి లోనకుచొరబడ్డాడని, బీరువాలోని రూ. 20వేల సొత్తుతో పాటు సెల్ ఫోన్ తస్కరించాడని కంచరపాలెం నేరవిభాగ పోలీసులకు ఫిర్యాదిచ్చారు. అదే సమయంలో ఆ ప్రాంతంలోని మరికొన్ని ఇళ్లలోకి కూడా దొంగలుచొరబడ్డారని పోలీసులకు ఫిర్యాదు అందింది. విచిత్రమేంటంటే ఓఇంట్లోని సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల్ని పరిశీలిస్తే ఓ వ్యక్తి తనదుస్తులు విప్పేసి, నగ్నంగానే ఇంట్లోకి చొరబడినట్టు పోలీసులు గుర్తిం

చారు. అయితే తమ విచారణలో ఆ వ్యక్తి సైకోగా తేలిందని, విచారణచేపట్టామని క్రైం ఎస్ఐ మన్మథరావు చెబుతున్నారు. మరో ఇంట్లో ఉదయం

లేచి చూసేసరికి, చిందరవందరగా ఉందని, సొత్తేమీ పోకపోయినా తమకు మాత్రం ఆ ప్రాంతంలో భద్రత కరువైందని యజమానులు వాపోతున్నారు. ఇంటి వెనుక గోడ దూకేసి బయటకు వెళ్లిపోవడాన్ని తాము గుర్తించామని, తమకు మెలకువ వచ్చి చూసేసరికి చప్పుడై, అప్రమత్తమై పారిపోయి నట్టుగా డయల్ 100కు కూడా బాధితులు ఫోన్ చేసి సమాచారం అంద జేశారు. కొత్త దొంగల ఆచూకీపై పరిశీలిస్తున్నామని ఇన్ స్పెక్టర్ సత్యనా రాయణ చెప్పారు. యజమానులు కూడా ఫిర్యాదివ్వాలని చెప్పగా.. మళ్లీ ఏమీ పోలేదని చెబుతున్నారని, అయినప్పటికీ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

# తాటితూరు హిందీ ఉపాధ్యాయునికి రెండు అవార్డులు

భీమునిపట్నం : భీమిలి మండలం లోని, తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులు గా పనిచేస్తున్న బ్రైట్ స్వచ్ఛంద సంస్థ 2020అవార్డు, అదేవిధంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు 2020లు దక్కినందుకు సంతోషంగా ఉందని టి.ఎస్.వి ప్రసాదరావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు కు చెందిన మనం ఫౌండేషన్ ఆర్గనైజర్ న్యాయవాది చక్రవర్తి ద్వారా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు తన స్వంత నిధుల తో చేసిన సేవా కార్యక్రమాలు, యోగ విద్య అందించినందుకు వచ్చిందనీ, బ్రైట్ స్వచ్ఛంద సంస్థ అవార్డు అనకాపల్లి కి చెందిన బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు కె.శివశంకర్ చెప్పి మెయిల్ లో సర్టిఫికెట్ పంపారనీ చెప్పారు. కరోనా సమయంలో 6-10 తరగతులు చదివిన విద్యార్థులకు యూట్యూబ్ ద్వారా హిందీ భాషకు సంబంధించిన పాఠాలు, బాలగీతాలు,కవి పరిచయాలు, సామాజిక విషయాలపై అవగాహన కల్పించినందుకు ఈ అవార్డు దక్కిందనీ అన్నారు. ఈ అవార్డులు వచ్చినందుకు తాటితూరు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారనీ తెలిపారు.

## దేవరాపల్లి, వేచలం పిహెచ్‌సిలకు

# రెండో వైద్యాధికారులు నియామకం

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో రెండో వైద్యాధికారిగా బి. రాజేష్ కుమార్ బాధ్యతలు చేపట్టినట్లు ప్రస్తుత వైద్యాధికారిణి ఎస్. లలిత సోమవారం తెలిపారు.

అలాగే మండలంలోని వేచలం పిహెచ్‌సి కి కూడా రెండో వైద్యాధికారిగా డి. గోవింద రెడ్డి బాధ్యతలు చేపట్టినట్లు ప్రస్తుత వైద్యధికారిణి బి.హారిక తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పీహెచ్‌సి కి ఇద్దరు వైద్యుల్ని నియమిస్తా మని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం దేవరా పల్లి, వేచలం పి హెచ్ సి లకు రెండో వైద్యులను నియమించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# స్పందన కార్యక్రమానికి 186 వినతులు

## - జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి



శ్రీకాకుళం : స్పందన కార్యక్రమానికి 186 వినతులు వచ్చినట్లు జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని స్పందన విభాగంలో స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవిన్యూ శాఖకు చెందినవి 33 కాగా, పౌర సరఫరాల శాఖవి 24, ఇతర శాఖలకు సంబంధించి 129 వినతులు ఉన్నాయన్నారు. కరోనా నేపధ్యంలో ప్రజలు జిల్లా ప్రధాన కేంద్రానికి రాకుండా ఫోన్ లేదా ఇ-మెయిల్ ద్వారా వినతులు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ పిలుపునిచ్చిన సంగతి విదితమే. అందులో భాగంగా సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఫోన్ చేసి 186 మంది తమ ఫిర్యాదులను తెలియజేసారని చెప్పారు.

**వాటి వివరాలు ఇలా** : బూర్జ మండలం మామిడివలస నుండి కేదారినాథ్ సాహు ఫోన్ చేసి మాట్లాడుతూ యన్.టి.ఆర్. జలసిరి పథకం ద్వారా బోర్ కొరకు 25 వేల రూపాయల డిమాండ్ డ్రాఫ్ట్ ను చెల్లించడం జరిగింది. కాని అప్పటినుండి ఇప్పటివరకు అది పనిచేయడం లేదని ఫిర్యాదు చేసారు. ఎచ్చెర్ల మండలం ముద్దాడ నుండి యస్.మోహనరావు మాట్లాడుతూ తాను ప్రైవేటు పాఠశాలలో పనిచేసేవాడినని, కాని ఇప్పుడు తీసివేసారని, అందువలన ఎటువంటి జీవనాధారం లేకుండా పోయిందని చెప్పారు. కావున తనకు ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు. ఆమదాలవలస మండలం నెల్లిమెట్ట నుండి బొడ్డేపల్లి అప్పారావు ఫోన్ చేస్తూ తమ గ్రామానికి దగ్గరలో గల రెల్లిగెడ్డ నుండి నీరు పొలం లోపల నుండి పారుచున్నందున అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు. నగరంలోని గుజరాతీపేట నుండి కె.నీలకంఠేశ్వర రావు మాట్లాడుతూ తాను 2000 జనవరి 1న ఏపిఇపిడిసిఎల్ సర్వీసులో చేరియున్నానని, తన భవిష్యనిధిని ఇపిఎఫ్ నుండి జిపిఎఫ్ నకు మార్పుచేయాలని కోరారు. భామిని నుండి సిహెచ్.అప్పారావు మాట్లాడుతూ తమ గ్రామంలోని తెలుగు ఉపాధ్యాయులు ఆన్ లైన్ క్లాసులను చెప్పుటకు అనుమతిని మంజూరుచేయాలని కోరారు. జి.సిగడాం మండలం నిద్దాం నుండి యం.రవికుమార్ మాట్లాడుతూ తనకు 2018-19లో ఇళ్లు మంజూరైందని, పనులు పూర్తయినప్పటికీ బిల్లులు ఇంతవరకు చెల్లించలేదని ఫిర్యాదు చేశారు. రాజాం నుండి పి.పార్వతి మాట్లాడుతూ వై.యస్.ఆర్.చేయూత కొరకు దరఖాస్తు చేయడం జరిగిందని, తాను అర్హురాలు అయినప్పటికీ ఇంతవరకు నగదు జమకాలేదని ఫిర్యాదు చేశారు. నందిగాం మండలం జయపురం నుండి డి.సుధాకర్ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్త సరిగా సరుకులను ఇవ్వడంలేదని, ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కొత్తూరు మండలం నివగాం నుండి బి.సుందరనారాయణ మాట్లాడుతూ కొత్తూరు, నివగాం, మాతల, వసప గ్రామాల్లోని క్వారంటీన్లకు భోజనం సరఫరా చేసామని, వాటి బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యా లయం హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ అప్పారావు, స్పందన విభాగం భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్వేది రథం దగ్ధం బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలి

## - బీజేపీ రాష్ట్ర రైతునాయకులు వై.వి.సుబ్బారావు



గుంటూరు: తూర్పుగోదావరి జిల్లా అంతర్వేదిలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి రథం కాలిపోయిన విధానం చూస్తుంటే కుట్ర ప్రకారమే జరిగినట్లు అనుమానంగా ఉందని, అంతర్వేది ఆలయంలో రథం దగం ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర రైతు నాయుకులు వై.వి.సుబ్బారావు డిమాండ్ చేశారు.

ఈ ఘటనపై సీఎం జగన్ స్వయంగా స్పందించాలని ఆయన కోరారు.

దీన్ని మతిస్థితిమితం లేని వ్యక్తి చేసిన చర్యగా వదిలేయకుండా డీజీపీతో ప్రత్యక్షంగా మాట్లాడాలని.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వై.వి.సుబ్బారావు సూచించారు. శనివారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంట సమయంలో అంతర్వేది ఆలయం షెడ్డులో భద్రపరిచిన రథానికి మంటలు అంటుకొని దగ్ధం అయింది. అయితే రథానికి మంటలు అంటుకోవడం ప్రమాదవశాత్తు జరిగిందా, ఆకతాయిల పనా? అనే దానిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. 40 అడుగులు ఉన్న ఈ రథాన్ని 60 ఏళ్ల క్రితం టేకు కలప తో తయారు చేశారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఏటా ఇక్కడ ఘనంగా రథోత్సవం నిర్వహించడం ఆనవా యితీగా వస్తోందని బీజేపీ రాష్ట్ర రైతు నాయకులు వై.వి.సుబ్బారావు తెలియజేశారు.

# మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## - వైయస్ఆర్ సంపూర్ణ పోషణ గర్భవతులు బాలింతలకు వరం లాంటిది



కడప : వైయస్ఆర్ సంపూర్ణ పోషణ.... గర్భవతులు బాలింతలకు వరంలాంటిదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి. అంజాద్బాష పేర్కొన్నారు. సోమవారం బ్రాహ్మణ వీధిలోని ఉర్దూ ప్రైమరీ స్కూల్ నందు స్త్రీ శిశు సంక్షేమశాఖవారి ఆధ్వర్యంలో వైయస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను ఉప ముఖ్యమంత్రి వర్యులు గర్భవతులు బాలింతలకు అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రివర్యులు తాడేపల్లిలో కంప్యూటర్ స్విచ్ ఆన్ చేసి వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. మహిళలు గర్భవతులు వైయస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకుని నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలన్నారు. వైయస్ఆర్ సంపూర్ణ పోషణ ద్వారా ఒక కేజీ అటుకులు, కేజీ రాగి పిండి, కేజీ సొద్దపిండి, ఎండు ఖర్జూరం ప్యాకెట్, కాల్ కేజీ బెల్లం, చికిడి ప్యాకెట్టు, మొత్తం ఆరు వస్తువుల కిట్టు తయారు చేసి బాలింతలు గర్భవతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రివర్యులు పేదలకు ఇచ్చే ప్రతి వస్తువు క్వాలిటీతో ఉండాలని ప్రతి వస్తువు పరిశీలించి పేదలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. గర్భవతులు బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకుని శిశు మరణాలు తగ్గించాలనే ఉద్దేశంతో వైయస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల 15 వేల మంది గర్భవతులు బాలింతలకు 1865 కోట్ల రూపాయలు ప్రతి ఏడాది ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. రాబోవు రోజుల్లో శిశుమరణాలు పూర్తిగా తగ్గించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టడం జరుగుతుందన్నారు. ఐసీడీఎస్ పీడీ పద్మజ మాట్లాడుతూ బాలింతలు గర్భవతులకు మంచి పౌష్టికాహారం అందించేందుకు వైయస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతంలో ఈ పథకం ట్రైబల్ ఏరియా లో మాత్రమే ఉండేదని నేడు ప్రభుత్వం అన్ని ఏరియాలలో ఈ పథకాన్ని వర్తింపజేయడం జరిగిందన్నారు. మహిళలు ఈ పౌష్టికాహారాన్ని నెల పొడవునా తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గించుకుని వ్యాధి నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. పిల్లలలో ఎదుగుదల రావడం, బరువు పెరగడం, ఎత్తు పెరిగేందుకు బాలింతలు గర్భవతులు తప్పకుండా ఈ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లి ఆరోగ్యంగా ఉంటే పుట్టే బిడ్డ సంపూర్ణమైన ఆరోగ్యంగా జన్మిస్తార న్నారు. కావున లబ్ధిదారులు అందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ అరుణకుమారి, గర్భవతులు బాలింతలు, 31 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి అజ్మతుల్లా, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, తదితరులు పాల్గొన్నారు.

## నాగయ్యపేటలో 104 వైద్య సేవలు



దేవరాపల్లి : కరోనా విపత్కర వేళ రాష్ట్ర ప్రభుత్వం 104 వైద్య సేవలను మరింత విస్తృతం చేసింది. మండలంలో నాగయ్య పేట పంచాయతీలో సోమవారం సీతంపేట, నాగయ్య పేట గ్రామాలలో104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించారు. ఎనభై తొమ్మిది మందికి మందులు అందజేశామని డాక్టర్ ఎం. వెంకటస్వామి తెలిపారు .ఈ కార్యక్రమంలో డిఈఓ జి.అరుణ, ఏఎన్ఎం ఆర్. సత్యవతి, ఆశావర్కర్లు సిహెచ్ లక్ష్మి, వి. లక్ష్మి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం

## - రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి

శ్రీకాకుళం : రాష్ట్రంలోని రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్న బాలింతలు, గర్భిణీ స్త్రీలతో పాటు 6 నుంచి 72 నెలలలోపు పిల్లల కోసం వై.యస్.ఆర్.సంపూర్ణ పోషణ మరియు వై.యస్.ఆర్.సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలను నేటి నుండి అమలుచేయనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం అమరావతి నుండి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వై.ఎస్.ఆర్. సంపూర్ణ పోషణ, వై.ఎస్.ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. వై.ఎస్.ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ గిరిజన ప్రాంతాల్లోనూ, వై.ఎస్.ఆర్. సంపూర్ణ పోషణ కార్యక్రమం గిరిజనేతర ప్రాంతాల్లో అమలుచేయడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ఈ పౌష్టికాహారం అందించడం జరుగుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్న బాలింతలు, గర్భిణీ స్త్రీలతో పాటు 6 నుంచి 72 నెలలలోపు పిల్లలకు ఈ పథకాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. వై.ఎస్.ఆర్. సంపూర్ణ పోషణ ప్లస్ పథకం కింద 77 రాష్ట్రంలోని గిరిజన మండలాల్లో 3.80 లక్షల గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ఉన్నారని వీరికోసం రూ.307.55 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందని సిఎం చెప్పారు. అలాగే వై.ఎస్.ఆర్. పోషణ పథకం కింద 77 గిరిజన మండలాలు మినహా రాష్ట్ర వ్యాప్తంగా 26.36 లక్షలు గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల కోసం మొత్తం రూ.1555.56 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్న బాలింతలు, గర్భిణీలతో పాటు, 6 నుంచి 72 నెలలలోపు పిల్లలకు వై.యస్.ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేయనున్నామని చెప్పారు. ఇప్పటికే వై.యస్.ఆర్ అమృత హస్తం, మధ్యాహ్న భోజన పథకం, బాలామృతం, వై.యస్.ఆర్ బాల సంజీవని వంటి పథకాలను అమలు చేయడం జరుగుతోందని సిఎం గుర్తుచేసారు. ఈ పథకంలో భాగంగా గర్భిణీలకు, బాలింతలకు నెలలో 25 రోజులు వేడి పాలు, అన్నం, పప్పు, కూరగాయలు లేదా ఆకుకూరలు, కోడి గుడ్లు సరఫరా చేస్తారు. టేక్ హోమ్ న్యూట్రిషన్ కిట్ కింద నెలకు 250 గ్రాముల వేరుశనగ చెక్కీ, కిలో రాగి పిండి, 250 గ్రాముల బెల్లం, మరో 250 గ్రాముల ఎండు ఖర్జూరం, కిలో సజ్జ పిండి అందిస్తారని తెలిపారు. దీని కోసం ఒక్కొక్కరిపై నెలకు రూ.850 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయనున్నట్లు వివరించారు.





36 నుండి 72 నెలల చిన్నారులకు నెలలో 25 రోజులు అన్నం, పప్పు, ఆకుకూరలు లేదా కూరగాయలు, పాలు, కోడి గుడ్డు, స్నాక్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం నెలకు ఒక్కొక్కరిపై రూ.350 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తుందని తెలిపారు. 6 నుంచి 36 నెలల చిన్నారులకు టేక్ హోం న్యూట్రిషన్ కిట్ కింద నెలకు 2.5 కిలోల బాలామృతం, 25 కోడి గుడ్లతో పాటు, 2.5 లీటర్ల పాలు సరఫరా చేయడం జరుగుతుందని, ఇందుకు నెలకు ఒక్కొక్కరిపై రూ.412 చొప్పున ఖర్చు చేయనున్నట్లు వివరించారు.

ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో గిరిజన ప్రాంత మండలాల్లో అదనపు పౌష్టికాహారం అందించుటకు జనవరి 2020 నుండి వై.యస్.ఆర్ సంపూర్ణ పథకం ప్రారంభించగా, సోమ వారం నుండి ప్రారంభం కానున్న పోషణ పథకం క్రింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సైతం అమలు చేయడం జరుగుతుందని ముఖ్యమంత్రికి వివరించారు.

వై.యస్.ఆర్ సంపూర్ణ పోషణ పథకం క్రింద శ్రీకాకుళం జిల్లాలో 11,877 మంది గర్భిణీ స్త్రీలు., 11,236 మంది బాలింతలు., 6 నెలల నుండి సంవత్సరం వయస్సుగల చిన్నారులు 9,866 మంది., సంవత్సరం నుండి 3 సంవత్సరాల వయస్సుగల చిన్నారులు 26,044 మంది., 3 నుండి 6 సంవత్సరాల వయస్సుగల చిన్నారులు 36,483 మంది వెరశి 95,506 మంది లబ్ధిపొందుతున్నారని కలెక్టర్ సిఎంకు తెలిపారు.



వై.యస్.ఆర్ సంపూర్ణ పోషణ పథకం ప్లస్ క్రింద 7,924 మంది గర్భిణీ స్త్రీలు., 7,695 మంది బాలింతలు., 6 నెలల నుండి సంవత్సరం వయస్సుగల చిన్నారులు 6,576 మంది., సంవత్సరం నుండి 3 సంవత్సరాల వయస్సుగల చిన్నారులు 17,363 మంది., 3 నుండి 6 సంవత్సరాల వయస్సుగల చిన్నారులు 24,320 మంది వెరశి 63,878 మంది లబ్ధిపొందుతున్నారని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర శాసనసభాపతి తమ్మినేని సీతారామ్, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ మరియు రాష్ట్ర పశుసంవర్ధక శాఖామాత్యులు డా. సీదిరి అప్పలరాజు పౌష్టికాహార కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ సమావేశంలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి సిహెచ్ శ్రీధర్, జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డా. జి.జయదేవి తదితరులు పాల్గొన్నారు.



## సంపూర్ణ పోషణతో

# ఆరోగ్యకర వ్యవస్థకు శ్రీకారం

### రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం



శ్రీకాకుళం : సంపూర్ణ పోషణ పథకంతో రాష్ట్రంలో ఆరోగ్యకర వ్యవస్థకు ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. సోమ వారం రాష్ట్ర ముఖ్య మంత్రి వై.యస్.జగన్ మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రారంభించిన వై.యస్.ఆర్ సంపూర్ణ పోషణ పథకం కార్యక్రమానికి సభాపతి కలెక్టర్ కార్యాలయంలో హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం మీడియా ప్రతినిధులతో సభాపతి మాట్లాడుతూ రాష్ట్రంలోని రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్న బాలింతలు, గర్భిణీ స్త్రీలతో పాటు 6 నుంచి 72 నెలలలోపు పిల్లల కోసం వై.యస్.ఆర్.సంపూర్ణ పోషణ పథకం, వై.యస్.ఆర్.సంపూర్ణ పోషణ ప్లస్ పథకాలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ఈ పౌష్టికాహారం అందించడం జరుగుతుందని ఆయన చెప్పారు. వై.ఎస్.ఆర్. సంపూర్ణ పోషణ ప్లస్ పథకం కింద రాష్ట్రంలోని 77 గిరిజన మండలాల్లో 3.80 లక్షల గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ఉన్నారని వీరికోసం రూ.307.55 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. వై.ఎస్.ఆర్. పోషణ పథకం కింద 77 గిరిజన మండలాలు మినహా రాష్ట్ర వ్యాప్తంగా 26.36 లక్షలు గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల కోసం మొత్తం రూ.1555.56 కోట్లు ఖర్చు చేయనున్నట్లు సభాపతి వివరించారు. ఇప్పటికే వై.యస్.ఆర్ అమృత హస్తం, మధ్యాహ్న భోజన పథకం, బాలామృతం, వై.యస్.ఆర్ బాల సంజీవని వంటి పథకాలను అమలు చేయడం జరుగుతోందని ఆయన తెలిపారు.

పథకంలో భాగంగా గర్భిణీలకు, బాలింతలకు నెలలో 25 రోజులు వేడి పాలు, అన్నం, పప్పు, కూరగాయలు లేదా ఆకుకూరలు, కోడి గుడ్లు సరఫరా చేస్తారు. టేక్ హెూమ్ న్యూట్రిషన్ కిట్ కింద నెలకు 250 గ్రాముల వేరుశనగ చెక్కీ, కిలో రాగి పిండి, 250 గ్రాముల బెల్లం, మరో 250 గ్రాముల ఎండు ఖర్జూరం, కిలో సజ్జ పిండి అందిస్తారని తెలిపారు. దీని కోసం ఒక్కొక్కరిపై నెలకు రూ.850 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయనున్నట్లు ఆయన వివరించారు. 36 నుండి 72 నెలల చిన్నారులకు నెలలో 25 రోజులు అన్నం, పప్పు, ఆకుకూరలు లేదా కూరగాయలు, పాలు, కోడి గుడ్డు, స్నాక్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఇందుకోసం నెలకు ఒక్కొక్కరిపై రూ.350 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తుందని తెలిపారు. 6 నుంచి 36 నెలల చిన్నారులకు టేక్ హెూం న్యూట్రిషన్ కిట్ కింద నెలకు 2.5 కిలోల బాలామృతం, 25 కోడి గుడ్లతో పాటు, 2.5 లీటర్ల పాలు సరఫరా చేయడం జరుగుతుందని, ఇందుకు నెలకు ఒక్కొక్కరిపై రూ.412 చొప్పున ఖర్చు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వై.యస్.ఆర్ సంపూర్ణ పోషణ పథకం క్రింద శ్రీకాకుళం జిల్లాలో 11,877 మంది గర్భిణీ స్త్రీలు., 11,236 మంది బాలింతలు., 6 నెలల నుండి సంవత్సరం వయస్సుగల చిన్నారులు 9,866 మంది., సంవత్సరం నుండి 3 సంవత్సరాల వయస్సుగల చిన్నారులు 26,044 మంది., 3 నుండి 6 సంవత్సరాల వయస్సుగల చిన్నారులు 36,483 మంది వెరశి 95,506 మంది లబ్దిపొందుతున్నారని సభాపతి తెలిపారు.తల్లి గర్భంలో ఉన్నప్పటి నుండే పౌష్టికాహారం అందడం వలన ఆరోగ్యకరంగా జన్మించడం జరుగుతుందని, తద్వారా ఆరోగ్యకర సమాజం ఏర్పడగలదని ఆయన అన్నారు.

# కోవిడ్ రోగులకు మెరుగైన కార్పొరేట్ సేవలు

### పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విశాఖపట్నం : కింగ్ జార్జి ఆసుపత్రిలో నిర్మించిన సి.ఎస్.ఆర్. బ్లాక్ లో కరోనా రోగులకు మెరుగైన కార్పొరేట్ సేవలు అందజేస్తారని పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన సి.ఎస్.ఆర్. బ్లాక్ ను సందర్శించారు. విభాగంలో నున్న గదులు, పరికరాలు, అందుబాటులో వున్న సేవలను పరిశీలించారు. కరోనా రోగులకు అందజేసే సౌకర్యాలు, చికిత్సలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. కె.జి.హెచ్. పర్యవేక్షకులు డాక్టర్ పి.వి. సుధాకర్ అక్కడ గల సౌకర్యాలను గూర్చి తెలిపారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేదలందరికీ విద్య, వైద్య సేవలు కార్పొరేట్ స్థాయిలో అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కరోనా నియంత్రణకు వైద్యులు, సిబ్బంది తమ ప్రాణాలకు తెగించి సేవలు చేస్తున్నారని, వృత్తిలోని నిబద్ధత, నిజాయితీలను ప్రదర్శిస్తు న్నారని ప్రశంసించారు. సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన విభాగంలో ప్రస్తుతం కోవిడ్ రోగులకు మెరుగైన కార్పొరేట్ స్థాయి చికిత్స అందించ నున్నట్లు వెల్లడించారు. ఆసుపత్రిలో 500 పడకలు, 175 వెంటిలేటర్లు వున్నాయని చెప్పారు. దీనితో నగరంలో మొత్తం 1200 పడకలతో కరోనా బాధిత పేదలకు ఉచిత సేవలు అందుబాటులోనికి రానున్నట్లు చెప్పారు. నగరంలో ఛాతీ ఆసుపత్రి,ఈఎన్ టీ ఆసుపత్రులు, ఉత్తరాంధ్ర నాలుగు జిల్లాలకు సంబంధించి విమ్స్ ఆసుపత్రిలో ప్రభుత్వ సేవలు అందుబాటులో వుండగా అదనంగా సిఎస్ఆర్ బ్లాక్ చేరిందన్నారు. జిల్లాలోని అన్ని పిహెచ్ సిలలో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.జి.హెచ్. సూపరింటెండెంట్, ఎ.ఎమ్.సి. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.సుధాకర్, డాక్టర్ శాస్త్రి, పర్యాటకశాఖ ఆర్.డి. ఇతర వైద్యులు పాల్గొన్నారు.

## మంత్రి, జిల్లా కలెక్టర్ లను మర్యాద పూర్వకంగా కలసిన ద్యాన్‌చంద్ అవార్డు గ్రహీత ఎన్.ఉష



విశాఖపట్నం : ద్యాన్ చంద్ అవార్డు గ్రహీత, అంతర్జాతీయ క్రీడాకారిణి (బాక్సింగ్, మహిళా విభాగం) ఎన్. ఉష, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ లను కలక్టరు చాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిసారు. మరిన్ని అవార్డులు తీసుకువచ్చి భవిస్యత్ తో మరింత ప్రతిభ కనపరచాలని మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మరియు జిల్లా కలక్టరు వి. వినయ్ చంద్ లు అభిలషించారు. ఈ కార్యక్రమంలో సెట్విస్ సిఇఓ బి. శ్రీనివాసరావు, జిల్లా క్రీడా అధికారి ఎన్. సూర్యారావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, బాక్సింగ్ కోచ్ ఐ. వెంకటేశ్వరరావు, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బి. అప్పన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోంది

### - ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు వాహనాలు పంపిణీ చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విశాఖపట్నం : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పలు కార్యక్రమాల ను అమలు చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో ఎస్.సి. కార్పొరేషన్ ద్వారా లబ్దిదారులకు వాహనాలను మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్, రెల్లి కార్పొరేషన్ అధ్యక్షులు మధుసూధనరావు పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీలు, మహిళలు సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కట్టుబడి, అహర్నిశలు శ్రమమిస్తున్నారని తెలిపారు. మొత్తం ఖరీదు రూ.2.91 కోట్లతో 17 ఇన్నోవా (బిఎస్6-మోడల్) వాహనాలను 17 మంది లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఇందులో ఒక కారు ఖరీదు రూ.17,14,747/-లని, ఇందులో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రూ.6,00,161/-లని, ఎన్.ఎస్.ఎఫ్.డి.సి. ఋణంగా రూ.10,74,586/-లని ఆయన వివరించారు. మొత్తం సబ్సిడీ రూ.1.02 కోట్లు, ఋణంగా రూ.1.82/- కోట్లని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోవిందరావు, ఎస్.సి. కార్పొరేషన్ కార్యనిర్వహక అధికారి ఎం.ఎస్. సోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

### కరోనాతో పోరాడగలను : శిఖర్ ధావన్

ఒకవేళ తనకు కరోనా సోకినా.. వైరస్‌ను జయించే శక్తి తన శరీరానికి ఉందని ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ శిఖర్ ధావన్ అన్నాడు. మహమ్మారి కారణంగా క్రికెట్ ఆడటానికి వచ్చిన ధావన్‌కు భయం వేయలేదా? అన్న ప్రశ్నకు ఇలా సమాధానం ఇచ్చాడు. "నా శరీరంపై నాకు పూర్తి నమ్మకం ఉంది. ఆడటం పట్ల ఎప్పుడూ భయపడలేదు. వైరస్ సోకుతుందని నాకు తెలుసు.. కానీ నేను దానితో పోరాడగలను." అన్నాడు.

బీసీసీఐ, సంబంధిత ఫ్రాంచైజీలు నిర్దేశించిన మార్గదర్శకాలను ఆటగాళ్లందరూ కచ్చితంగా పాటిస్తున్నారని ధావన్ అన్నాడు. తాను కూడా 8-9 సార్లు కరోనా పరీక్షలు చేయించుకున్నానని తెలిపాడు. ఈ కఠినమైన సమయంలో కూడా బీసీసీఐ ఇంత పెద్ద టోర్నీ నిర్వహించడం నిజంగా అభినందనీయమన్నాడు.

# సింహాచలం దేవస్థానంలో ఫోరెన్సిక్ ఆడిట్..

### - ఆడిట్ తో వెలుగు చూడనున్న టీడీపీ హయాంలో అక్రమాలు



సింహాచలం: తెలుగుదేశం మాజీమంత్రి అయ్యన్నపాత్రుడిపై మన్సాస్ ట్రస్ట్, సింహాచలం దేవస్థానం పాలకమండలి ఛైర్‌పర్సన్ సంచైత గజపతి మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. విమర్శలు గుప్పించారు. తెలుగుదేశం పార్టీ నాయకుల అక్రమాలు వెలుగులోకి వచ్చే సమయం దగ్గర పడిందని అన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో అధికారాన్ని అడ్డుగా పెట్టుకుని రెచ్చిపోయారని, ఆలయ ఆస్తులను కాజేశారని మండిపడ్డారు. ఈ మేరకు ఆమె ఆదివారం వరుస ట్వీట్లను సంధించారు.

సింహాచలం దేవస్థానంలో ఫోరెన్సిక్ ఆడిట్‌ను మొదలు పెట్టారని, దీనివల్ల తెలుగుదేశం నాయకుల అక్రమాలు, తప్పులు వెంటాడుతాయనే భయాందోళనలు ఆ పార్టీ నాయకుల్లో వ్యక్తమౌతున్నాయని అన్నారు. తెలుగుదేశం పార్టీ నేతలు, మద్దతుదారులు, సానుభూతిపరులు ప్రతిష్ఠాత్మక సింహాచలం ఆలయ భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. దేవాలయ భూములను ఆక్రమించడం నిజం కాదా? అంటూ ఆమె అయ్యన్నపాత్రుడిని నిలదీశారు. అయ్యన్నపాత్రుడు రాష్ట్రం, జిల్లా రాజకీయాల్లో సీనియర్ అని, అలాంటి నాయకుడు బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేయడం, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం సహేతుకం కాదని చెప్పారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత అశోక గజపతి రాజు సోదరుడు ఆనంద గజపతిరాజు పెద్ద కుమార్తె అనే విషయాన్ని విస్మరించ వద్దని గుర్తు చేశారు. సింహాచలం దేవస్థానంలో ఫోరెన్సిక్ ఆడిట్ అనే పేరు వింటే చంద్రబాబు నాయుడు సారథ్యంలోని తెలుగుదేశం పార్టీ నేతలు ఎందుకు వణికిపోతున్నారని ప్రశ్నించారు. తప్పు చేయనప్పుడు ఎందుకు భయపడాలని చెప్పారు.టీడీపీకి చెందిన అశోక గజపతి రాజు సింహాచలం దేవస్థానం ఛైర్మన్‌గా ఉన్న కాలంలో ఆలయానికి చెందిన విలువైన వస్తువులు మాయం అయ్యాయని ఆరోపణలు వచ్చిన విషయాన్ని మరిచిపోయారా? అని ఆమె అయ్యన్నపాత్రుడిని నిలదీశారు. అయిదేళ్లుగా దేవాలయ ఆస్తులపై లెక్కలు ఎందుకు సరిగ్గా రాయలేదని, దేవాలయానికి వచ్చే రాబడి, ఖర్చులు చెప్పే ఖాతాలను సరైన పద్ధతిలో ఎందుకు నిర్ధారించలేదని ప్రశ్నించారు. సింహాచలం కొండ దిగువన ఉన్న దేవస్థానం ఛైర్మన్ బంగళాను అశోక గజపతి రాజు ఇంకా ఖాళీ చేయలేదనే విషయం అయ్యన్నపాత్రుడికి తెలియదని ఎద్దేవా చేశారు. ఆ బంగళా పేరు మీద ఎన్ని బిల్లులను పాలక మండలి పంపించారో తెలుసా? అని సంచైత నిలదీశారు. అశోక గజపతి రాజు తల్లి అదే బంగళాలో ఉన్నారని, ఆమె జ్ఞాపకాలను ఆయన గుర్తు చేసుకుంటూ ఉంటరనే కారణంతోనే తాను ఇప్పుడా విషయాలను ప్రస్తావించ దలచుకోలేదని సంచైత చెప్పారు.

# వికేంద్రీకరణ తోనే రాష్ట్ర అభివృద్ధి



విశాఖ సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మూడు రాజధానులు అడ్డుకునేందుకు అనేక కుటిల ప్రయత్నాలు చేస్తున్న నేటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు కి వ్యతిరేకంగా 48 గంటల పాటు స్థానిక జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నవ్యంధ్ర పోరాటహక్కుల వేదికలో భాగంగా నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన సత్య స్వరూప్ ,శరత్ చంద్ర లకు దీక్షా స్థలి వద్ద మద్దతు ఇస్తున్న వావిలపల్లి ప్రసాద్ (50 వ వార్డ్ అభ్యర్థి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ) ఈ కార్యక్రమంలో వార్డ్ నాయకులు పప్పల సునీత, నంబాళ ఈశ్వరరావు, బగాది విజయ్ , పైడి ప్రతాప్, పైడి కృష్ణ రావు ,ఎం. లక్ష్మి ,సీపాన రాము, శివాజీ ,జగదీష్ , మాలతీ, సుమతి, సరస మరియు తదితరులు పాల్గొన్నారు .

## డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించిన

### జివిఎంసి కమిషనర్ డా.జి.సృజన

విశాఖపట్నం : జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశపు మందిరం నుండి డయల్ యువర్ కమిషనర్ ప్రోగ్రాముము కమిషనర్ డా. జి. సృజన, టోల్ ఫ్రీ నం. 1800-4250-0009 ద్వారా ఉదయం 10.00 గం. నుండి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా ప్రజలనుండి విజ్ఞప్తులు స్వీకరించారు.

స్వీకరించిన విజ్ఞప్తులను స్వయంగా పరిష్కరించి తగు నివేదిక వెంటనే సమర్పించు నిమిత్తం ఆయా విభాగాల అధికారులను/జోనల్ కమిషనర్లకు పంపించారు. ఇందులో 1వ జోనుకు సంబందించి 01, 2వ జోనుకు సంబందించి 08, 3వ జోనుకు సంబందించి 04, 4వ జోనుకు సంబందించి 02, 5వ జోనుకు సంబందించి 06, 6వ జోనుకు సంబందించి 04, 7వ జోను(అనకాపల్లి)నకు సంబందించి 01, పి.డి. (యు.సి.డి) సంబందించి 01, మొత్తము 27 ఫిర్యాదులు ఫోను ద్వారా స్వీకరించారు మరియు ప్రధాన కార్యాలయ విభాగపు ఉన్నతాధికారులతోను, జోనల్ కమిషనర్లతోను మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులు, 03 రోజులలో పరిష్కరించేందుకుగాను తగు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ డా. జి. సృజన సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఎ.వి.రమణి, సోమన్నారాయణ, ప్రోజెక్ట్ డైరెక్టర్ (యు.సి.డి.) వై. శ్రీనివాసరావు, సి.సి.పి. విద్యుల్లత, సి.ఎం.ఓ.హెచ్. డా. కె.ఎస్.ఎల్.జి. శాస్త్రి, డి.సి.ఆర్. ఫణిరాం తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు కరోనా నెగెటివ్

చెన్నై: సుప్రసిద్ధ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు తాజాగా చేసిన పరీక్షల్లో కరోనా నెగెటివ్ వచ్చింది. ఈ విషయాన్ని ఆయన తనయుడు ఎస్పీ చరణ్ స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా వీడియోను పంచుకున్నారు.

"నాన్న ఆరోగ్యం గురించి వారాంతంలో అప్‌డేట్ ఇవ్వకలేకపోయా క్షమించండి. గతంతో పోలిస్తే, నాన్న ఊపిరితిత్తుల పనితీరు మెరుగవడంతో వెంటిలేటర్ తొలగిస్తారని మేము భావించాం. అయితే, ఊపిరితిత్తుల్లో ఇంకా ఇన్‌ఫెక్షన్ ఉండటంతో తీయలేదు. శుభవార్త ఏంటంటే, తాజాగా చేసిన పరీక్షల్లో నాన్నకు కరోనా నెగెటివ్ వచ్చింది. ఇక్కడ పాజిటివ్ లేదా నెగెటివ్ అన్నది సమస్య కాదు. నాన్న ఊపిరితిత్తులు త్వరగా మెరుగవ్వాలి. అయితే, ఇందుకు ఇంకొంత సమయం పట్టే అవకాశం ఉంది. వారాంతంలో అమ్మానాన్నల వివాహ వార్షికోత్సవం ఉండటంతో చిన్న సెలబ్రేషన్స్ చేశాం. నాన్న తన ఐపాడ్‌లో క్రికెట్, టెన్నిస్ చూస్తున్నారు. ఐపీఎల్ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఫిజియోథెరపీ కొనసాగుతోంది. నాన్న కోలుకోవాలని ప్రార్థించిన వారందరికీ ధన్యవాదాలు. ఈ ప్రార్థనలు ఇలాగే కొనసాగాలి." అని ఎస్పీ చరణ్ అన్నారు. కరోనాతో పోరాడుతూ ఆగస్టు 5న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చెన్నై ఎంజీఎం ఆస్పత్రిలో చేరారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com